ఆశ్చర్యవిభ్రాంతి

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

రాజనర్తకి కింశుకప్రభ వలయాకార మయూరనృత్యం తిలకించిన సభాస్తారుల హృదయాలన్నీ ఒక్క క్షణంలో క్రొక్కారు మెరుపులై పరుగులుపెట్టాయి!

అర్ధరాత్రి. చైత్ర పూర్ణిమ వెన్నెల వెల్లువలో అమరుకదేవభూపతి రాజప్రాసాదమే ఒక రాజహంసలా మెరిసింది. ఆ మహీపతి కింశుకప్రభ నృత్యచాతుర్య భంగిమలన్నీ నిశ్చలదృష్టితో పరిశీలించాడు. ఆ ఆనంద తన్మయతలో క్రమక్రమంగా అతనికి మైమరపే కలిగింది.

రాజప్రాసాదం పై అంతస్తుపై అమర్చిన నృత్యమండపంలో రాజవల్లభులయిన సదస్యులందరిదృష్టీ క్రమక్రమంగా కింశుకప్రభ లలితహస్త విన్యాసలీలలో లీనమైపోయింది.

కింశుకప్రభ కాలిఅందెల సవ్వడి, మంద్రమంద్రమైన వీణావేణుమృదంగ ధ్వని, నర్తకి వెనక నిలిచిన నట్టువరాండ్ర తాళ నిక్వాణాలు—అన్నీ ఒకే ఒక శ్రుతిగా మారుమోగి సదస్యులందరినీ నృత్య తన్మయతలో ముంచెత్తాయి.

అంతలో కింశుకప్రభ నృత్యం పరిసమాప్తమయింది. మమ్మార్లు మారుమోగిన మద్దెల ముక్తాయింపులసందడితో సదస్యులదంరు మళ్లీ ఈ లోకంలో పడ్డారు. వెనువెంటనే సాధువాదాలతో సభాపరిసరాలన్నీ మారుమోగాయి. ఆనాటి నృత్యభంగిమ లనేక విధాలుగా ప్రశంసిస్తూ సభ్యులంతా తిరిగి తమ భవనాలకు వెళ్లిపోయారు.

అమరుకదేవు డొక్క దీర్ఘనిశ్వాసం విడిచి లేచి నిలుచున్నాడు. కింశుకప్రభ వెనువెంటనే అతనిసన్నిధికి వెళ్లి కయిదండ ఇచ్చి నిలబడింది.

అత డంటేఅంటనట్టుగా ఆమె భుజం మీద చెయ్యివేసి తన శయ్యాగారంవైపు నడక సాగించాడు.

ఇంకొక నిమిషంలో వారిద్దరు శయ్యాగారంలో ప్రవేశించారు. అమరుకదేవు డేదో పరధ్యానంగా ఆలోచిస్తూ తన హంసతూలికాతల్పంమీద మేను వాల్చాడు. కింశుకప్రభ అతనిసరసనే ఆశయ్యపై ఒయ్యారంగా కూర్చుని అతనివైపు తదేకదృష్టితో చూచింది.

అమరుకదేవుడు నిద్రిస్తున్నాడా? మేలుకునే ఉన్నాడా? ఆమె కొసందేహమే తీరలేదు! అత డర్ధనిమీలిత నేత్రాలతో ఏదో పరధ్యానంగా ఆలోచిస్తున్నట్టు కనిపించాడు. శయ్యాగారంలోని దీపకాంతి అతని అర్ధనిమీలిత నేత్రాంతాలపై ప్రసరించి తళతళ మెరిసింది.

ఒక దీర్ఘనిశ్వాసం ఆమె పెదవులనుండి వెలువడింది. కింశుకప్రభ తనపార్శ్వంలో ఉన్న మద్యపాత్ర నెమ్మదిగా అమరుకదేవుని పెదవుల కందించింది. అతడు రెండు మూడు గుక్కలు చవిచూచి మళ్ళీ అలాగే శయ్యపై మేనువాల్చాడు. కొంచెంసే పామెవైపుచూచి నెమ్మదిగా ప్రశ్నించాడు:

"నీ వెవరవు?" అత డామెవైపెంతో వింతగా చూచి అలాగే ఆశ్చర్యపోయాడు. కింశుకప్రభ చెక్కిళ్ళపై కన్నీటిబిందువు లొకటొకటిగా దిగజారాయి. కంఠస్వరం గద్గదభారంతో తొణికిసలాడింది.

"అంతటి గాఢానురాగమే ఈనాటి కీవిధంగా మారిపోయిందే! ఇక నే నెవరినో మీకు తెలుపుతుచేస్తేమాత్రం ప్రయోజన మేమిటి?"

అమరుకదేవు డామెవైపలాగే రెప్పపాటు లేకుండా చూచాడు. ఆమె మళ్ళీ చెప్పింది: "నాపేరు కింశుకప్రభ! ఇప్పటికైనా జ్ఞాపకం వచ్చిందా? నన్నీవిధంగా విస్మరించడం తమకు ధర్మమేనా?"

"కింశుకప్రభా! ఎవరు? నీవా? ఇంతగా మారిపోయావేమి? నిన్ను తిన్నగా గుర్తించలేకపోయానుసుమా!"

అమరుకదేవభూపతి నిద్రాభారసూచకంగా, లీలగా ఆవలించాడు. కింశుకప్రభ అది గ్రహించింది. దానితో ఆమె ఆత్మాభిమానానికొక పెద్దదెబ్బ తగిలింది:

"నిరంతర నృత్యగాన వినోదాలతో తామెంతో అలిసినట్టున్నారు. సెలవైతే తిరిగీ మరిఒకమారు తమదర్శనం చేసుకుంటాను. పాదదాసివిషయం ఈమాత్రమైనా జ్ఞప్తికిరావడం నిజంగా నా పూర్వజన్మ పుణ్యవిశేష ఫలితమే!"

కింశుకప్రభ తన కన్నీ రతనికి కనబడనీయకుండా ముఖం మరిఒకపక్కకుతిప్పివేసి నెమ్మదిగా అక్కడినించి వెళ్లిపోయింది.

అమరుకదేవు డెన్నోవిధాల ఆమెవిషయం జ్ఞాపకంచేసుకోవాలని ప్రయత్నించాడు. ఎంతసేపటికీ అతని కామెవిషయమే స్మరణకు రాలేదు!

"శేపంతఃపుర పరిచారికల నెవరినైనా ప్రశ్నిస్తే ఈ విషయం ఇట్టే తేలిపోతుంది! దీనికోసం ఇంతమథన ఎందుకు?

అని లోలోపలే సమాధానపడ్డాడు. కాని అతని వాజిజ్ఞాస అలాగే పుండుసలిపినట్టు సలిపింది. కాని ఎంతసేపటికీ అతని కావిషయం అంతు దొరకలేదు.

కింశుకప్రభ ఆనాడు నృత్యంచేసిన నర్తకీమణులందరిలోనూ రూపసి. నృత్యగాన విద్యలలో సాటిలేనినెరజాణ. నృత్యావసానంలో అతనికి కయిదండ ఇచ్చేమిషతో తనకుతానై కోరివచ్చి అతనిదగ్గర తన గోడంతా వెళ్లబోసుకుంది. అయినా అతని కామె ఎవరో గుర్తుకు రాలేదు!

అమరుకదేవుడు మద్యపాత్రలో మిగిలిన మద్యం అంతా ఒక చుక్కైనా మిగలకుండా ఒక్కగుక్కలో తాగివేసి, మళ్ళీ జిజ్ఞాసలో పడ్డాడు. అతనికేమీ గుర్తురాలేదు.

అతని దృష్టి పక్కనే తెరిచిఉన్న గవాక్షంగుండా విశాలానగరంవైపు తిరిగింది. నగర రాజవీథులన్నీ పాలవెన్నెల వెల్లువలో తలమునకలైనాయి. ఆ అతిలోకసౌందర్యం నిశ్చలదృష్టితో చూచిన అతనికి మరికొంతసేపటికి కొంచెం మగత నిద్ర పట్టింది. ఇంకా కొంత సేపటికి గాఢనిద్రాభారంలో మైమరిచిన అతని నేత్రాలప్రయత్నంగా మూసుకొన్నాయి. సన్నని

అగరుధూమమాలిక లాళియ్యాగారం అంతా వ్యాపించి అల్లిబిల్లిగా అల్లుకొన్నాయి. అమరుకదేవుని నిద్రాముద్రిత హృదయంలో చిత్రవిచిత్రమైనకలలనెమళ్లెన్నో రంగురంగుల పురులువిప్పి మైమరిచి నృత్యం చేశాయి.

౨

కొవడాని కది అమరుకదేవుని రహస్య మంత్రాగారమే. అయినా అతడా మంత్రాగారంలో వీణావాద్యంతో వినోదిస్తున్నాడు. ఆ సమయంలో మంత్రులెవరు అతని సన్నిధికి రావడానికి సాహసించరు. అయితే మహామాత్యుడు రాజ్యవర్ధనుని కతని సన్నిధికివచ్చి అత్యవసర రాజ్యకార్యమేదో నివేదించవలసిన అగత్యం ఏర్పడింది

రాజ్యవర్ధను డడుగుల సవ్వడి కాకుండా నెమ్మదిగా లోపలికివచ్చి అమరుకదేవుని సమీపంలో ఒక రత్నకంబళంమీద కూర్చున్నాడు. అగరుధూప ధూమమాలిక క్షణకాలం అమరుకదేవుని వీణ కలంకారమై నిలిచి నెమ్మది నెమ్మదిగా పైకెగసింది. మహామాత్యుడు కొంచెంసేపు వీణాగానం విని ఆనందిస్తున్నట్టు తల పంకించి, వేళ్ళ

★ ఆచార్య విశ్రాంతి ★

తాటించి పక్కతాళం వేశాడు. కాని అతని హృదయం ఆ వీణాగానంమీద లేదని మహారాజు గ్రహించుకొన్నాడు. వెనువెంటనే వీణావాద్యం విరమించి, కొంచెం విసుగుదలతో బొమముడి విరిచాడు. మహామాత్యుడేదేవో రాజ్యకార్య వ్యవహారాలేకరువు పెట్టాడుగాని మహారాజవి తిన్నగా వినిపించుకోలేదు. పైగా వేరే ఇంకొక వ్యవహారం గుచ్చిగుచ్చి అడిగాడు:

"ఇంతకీ విదర్భ వ్యవహారమేమైనది? ఆ మాట చెప్పవేమి?"

"విదర్భాధీశ్వరులు తమకన్యకను మీకీయడాని కంగీకరించలేదు. అయితే స్వయంవర మహోత్సవం నిశ్చయించి మిమ్మల్ని ఆ మహోత్సవాని కాహ్వానించారు. అంతే!"

అమరుకదేవు డంతకన్నా రూక్షంగా బొమముడి విరిచాడు:

"ఐతే వెంటనే సైన్యాలన్నిటినీ స్వయంవర యాత్రకోసం సన్నాహపరచండి!"

అమరుకదేవుడు మళ్ళీ వీణావాద్యంలో మైమరచాడు. మహామాత్యుడు నెమ్మదిగా అడిగాడు:

"స్వయంవరోత్సవానికి సైన్యసంరంభం ఎందుకు మహాప్రభూ!"

"అదంతా మీ కనతికాలంలోనే తెలుస్తుంది! ముందుగా మన సైన్యాలన్నీ సమాయత్తపరచండి."

మహారాజిక మహామాత్యునివైపొక్కమారయినా కన్నెత్తిచూడలేదు. అతని వేళ్లు మళ్లీ వీణాతంత్రులపై నృత్యం ప్రారంభించాయి.

ఆ ఆజ్ఞవిని రాజ్యవర్ధనుడు దిగాలుపడిపోయాడు. అమరుకదేవు డెప్పుడు అతనితో సంప్రతించనిదే ఏవ్యవహారము తలపెట్టలేదు. ఈ మధ్యన అతనికి మహారాజదర్శనమే దుర్లభమైపోయింది. ఒకవేళ దర్శనం దొరికినా అమరుకదేవుడంతగా అతనితో అయా రాజ్యవ్యవహారాలు సంప్రతించడమే మానివేశాడు. అదంతా రాజ్యవర్ధనునికత్యద్భుతంగా కనిపించింది. అతడు మారుమాట చెప్పలేక వీణావాద్యం విని ఆనందిస్తూ పక్కతాళం వేస్తూ తలవంచుకొని మరికొంచెంసేపక్కడ కూర్చున్నాడు. ఇంకా మరికొంతసేపుండి మహారాజుదగ్గర సెలవుతీసుకునివెళ్లిపోయాడు. ఆనాడంతా అతని హృదయంలో మహారాజును గురించిన మథనే!

దానికి కారణాలు లేకపోలేదు. మాళవ రాజ్య సింహాసనం చేజిక్కించుకొన్నప్పటినుంచీ అమరుకదేవుడెన్నడు అంత లోతుగా రాజ్యవ్యవహారాలలో జోక్యం కలిగించుకోలేదు. రాజ్యభారం అంతా రాజ్యవర్ధనునికి, మిగిలిన మంత్రులకు అప్పగించి నిత్యము భోగలాలసలో మైమరిచి యథేచ్ఛగా సంచరించాడు.

పొద్దస్తమానము వీణా వేణు మృదంగ వినోదాలు! ఆపైన నర్తకీమణుల లాస్య విద్యావినోదాలు! ఆపైన అతనికి మద్యపానము, మృగయ, ద్యూతము మొదలైన దుర్వ్యసనాలు కూడా అలవడ్డాయి.

ఆ పరిస్థితులలో ఒకనా డతడు విశాలాపుర పరిసరాలలో సింహాలవేట కుపక్రమించాడు. అది అత్యంత ప్రమాదకరమైన మృగయావినోదం. ఒకనాడతడెన్నెన్నో సింహాలను సంహరించాడు. కాని ఆ సింహాలలో ఒక కొదమసింహం శూలప్రహారం చవిచూచిన వెంటనే అతనిపై కురికి పంజాతో శిరస్సుపై ఒక గట్టిదెబ్బ కొట్టింది. ఆ దెబ్బతో గుర్రంమీదకూర్చుని స్వారీచేస్తున్న అమరుకదేవుడు హఠాత్తుగా స్పృహతప్పి నేలమీద కూలబడిపోయాడు. మిగిలిన రౌతులాసింహాన్ని వెంటనే సంహరించివేశారు. అమరుకదేవునికి కాయకస్తులా పరిచర్యలు చేశారు. కాని ఎంతసేపటకీ అతనికి తెలివిరాలేదు.

ఇక గత్యంతరంలేక నెమ్మదిగా అతనిని తిరిగీ రాజప్రాసాదానికి తీసుకుపోయారు. రాజవైద్యులెన్నెన్నో ప్రక్రియలు చెయ్యగా చెయ్యగా రెండుమూడు రోజులకతనికి కొంచెం తెలివివచ్చింది. ఇంకా కొంత కాలానికతడు క్రమక్రమంగా కోలుకున్నాడు. అతని కప్పటికి పరిపూర్ణారోగ్యభాగ్యం కలిగింది.

కాని అప్పటినించీ అతనికి పూర్వపు రాజ్య వ్యవహారాలేవీ తిన్నగా గుర్తుకు రాలేదు. సింహంపంజాదెబ్బవల్ల అతనికావిధమైన విస్మృతి కలిగిందనీ, క్రమక్రమంగా ఆ మానసికవ్యాధి దానంతటఅదే నయమైపోగలదనీ రాజవైద్యులంతా కలిసి ఏకగ్రీవంగా నిశ్చయించారు. తిరిగీ కాయకస్తులా చికిత్సలు చేశారు.

మహారాజు మనస్సు చాలావరకు కుదుటపడిందిగాని అతనికింకా సంపూర్ణస్మృతి కలగలేదు.

అయితే వేటనించి తిరిగివచ్చిన కొంత కాలానికతని వినోదవ్యాసంగం వేయిరెట్లినుమడించింది. నిరంతర వారకాంతా వ్యాసక్తి అతనికొక నిత్యకృత్యమై కూర్చుంది. నిత్యము మద్యపానమత్తతో మైమరిచిన అతని సన్నిధికి వెళ్ళడం, అంటే మహామాత్యునికికూడా కొంచెం సంకోచమే కలిగింది.

మహారాజీవిధంగా నిరంతర భోగలాలసలో మైమరిచిమత్తెక్కిపోవడానికి కారణం ఎవరికీ తిన్నగా తెలియలేదు.

క్రమక్రమంగా అమరుకదేవుని వినోదవ్యాసంగం ఆనాటికానాడు బాగా పెచ్చు పెరిగిపోయింది గాని కొంచమైనా తగ్గుముఖం పట్టలేదు.

అమరుకదేవునికి సింహం పంజా దెబ్బతగిలి అప్పుడే ఒక సంవత్సరంపైగా గడిచిపోయింది. అయినా అతని నిత్యభోగవినోదప్రసక్తి అలాగే ఇనుమడించింది గాని కొంచమైనా తగ్గలేదు.

అమరుకదేవుని అంతఃపురాంగనలు సుమారరవై మంది సుందరీ మణులు! ఇటీవల వారి సంఖ్య ఇంకా ఇనుమడించింది!

ఆపైన అతడు విదర్భదేశాధీశ్వరుని కుమార్తె లీలావతిని తనకిచ్చి వివాహం చెయ్యవలసిందని రాజదూతద్వారా ఒక సందేశం పంపించాడు.

3

కింశుకప్రభ పూర్వం అమరుకదేవుని హృదయం చూరగొన్న ఒక విశాలాపుర నర్తకి. క్రమక్రమంగా అమరుకదేవుని అనురాగ కటాక్షవీక్షణంపడి ఆమె అతని అంతఃపురంలోనే ప్రవేశించింది. మరి కొన్నాళ్లకు తన లలితకళాచాతుర్యంతో అతని హృదయమే వశపరుచుకుంది. కాని అమరుక భూపతి వేటనించి తిరిగి వచ్చినప్పటినించీ మరి ఆమెమాటే తలపెట్టడం మానుకున్నాడు. అప్పటినించీ ఆమె తిరిగీ అతని హృదయమెలాగైనా చూరగొనాలని తహతహలాడింది. ఆనాటి రాత్రి నృత్యం ముగిసిన తరవాత ఆమె మళ్లీ అతని అనుగ్రహం సంపాదించి కొంతవరకు సంతృప్తి పడింది. అయితే అతని హృదయం పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకోవాలని ఆమెనొక గట్టిపట్టుదల పట్టుకుని పీడించింది.

కింశుకప్రభ తన పైటచెరగులో ఒక విచిత్ర వస్తువేదో దాచి ఇంకెవరికీ తెలియకుండా అతిరహస్యంగా అతని రహస్య మంత్రాగారంలో ప్రవేశించింది.

అప్పటికొక ఝాముర్రాత్రి గడిచింది. నిశ్చలంగా వెలిగే దీపకళిక వెలుగులో అమరుకదేవునిముఖం ఆనాడామెకెంతో మనోజ్ఞంగా కనిపించింది.

అప్పుడప్పుడు కొంచెం కొంచెం మద్యం చవిచూచి ఏదో తీవ్రాలోచనలోపడి సతమతమవుతున్నాడు. ఆమె రహస్య మంత్రాగారం ద్వారం కొంచెం తెరచి కొంతసేపటివరకు అతనిధోరణిఅంతా అతిజాగ్రత్తగాపరిశీలించి చూచింది. హఠాత్తుగా లోపలికివెళ్లి అతనికెదురుగా చతికిలపడింది:

"మీకొక అమూల్యరత్నం బహూకరిస్తాను! మరి నాకేమిస్తారు?"

అతడొక్క నవ్వునవ్వి ఆమె పైటచెరగులో దాచిన ఆ అమూల్యరత్నం హఠాత్తుగా చేజిక్కించుకోవాలని ప్రయత్నించాడు. కాని ఆమె అతనిఎత్తు సాగనివ్వలేదు. దానితో అతని ఆట కట్టింది:

"నీకంతకన్నా అమూల్యరత్నమే బహూకరిస్తున్నాను! తీసుకో!"

అని ఆమె పెదవులపై కెంపులపహరింగబోయాడు. ఆమె తటాలున తనముఖం ఇంకొకపక్కకు తిప్పివేసుకుంది. అంతలో అతడామె చెక్కిలి ముద్దు పెట్టుకొన్నాడు. ఆ ఆదరణకే కింశుకప్రభ ఎంతో మురిసిపోయింది. తన పైటచెరగులో దాచిన చిత్రఫలకం హఠాత్తుగా అతని ముందుంచింది.

అమరుకదేవుడు రెప్పవాల్చకుండా ఆ చిత్తరువు పరిశీలించాడు. అతనిముఖం వికసించింది. ఆ ముఖవికాసం చూచి కింశుక లోలోపల బాగా మథన పడింది.

అది విదర్భదేశాధీశ్వరుని తనయ లీలావతి చిత్తరువు!

ఆ చిత్తరువుపై నిలిచిన అమరుకదేవుని దృష్టి మరి చలించలేదు! అతడు తదేక దృష్టితో ఆ చిత్తరువులోని బిత్తరివైపు చూచాడు:

"ఇంతటి జగదేకసుందరిని నేనింతకు పూర్వం ఎక్కడా కనీవినీ ఎరగనే!"

అప్రయత్నంగా వెలువడిన ఆ ప్రశస్తి వినగానే కింశుకప్రభ చెక్కిళ్లలో మోదుగపూ కాంతులు వికసించాయి:

"సరికొత్తవారయితే సరి! మీ కెవ్వరైనా అందగత్తెలే!"

కింశుకప్రభ అతని ఆదరణ కొంచం చవి చూచింది. దానితో బాగా కొండెక్కి కూర్చుని అదేపనిగా రుసరుసలాడడం మొదలుపెట్టింది.

అమరుకదేవు డామె నెన్నోవిధాల లాలించి బుజ్జగించాడు. ఆమె ఆ ఆదరణకు లోలోపల బాగా సంతోషించింది. అంతలో అతనిదృష్టి మళ్లీ లీలావతి చిత్తరువుమీదికి తిరిగింది. కింశుకప్రభ అది కనిపెట్టి హఠాత్తుగా అతని ఆశ్లేషబంధనం విడిపించుకొని ఒక్క దూకులో అక్కడినించి వెళ్లిపోయింది.

అమరుకదేవుని కామె ఈర్ష్యాసూయల ధోరణి అత్యంత విచిత్రంగా కనిపించింది.

కింశుకప్రభ అమరుకదేవుని కిటీవల లీలావతిపై మిక్కిలి మక్కువ కలిగిందని గ్రహించింది. తనమీద అతని అనురాగం ఇంకా ఇనుమడించాలని ఆశించింది. దానికోసం ఎంతో శ్రమపడి లీలావతి చిత్తరువొకటి సంపాదించి అతనికి బహూకరించింది. ఆ విధంగా అతని ఆదరాభిమానాలు చూరగొన్నానని బాగా మురిసిపోయింది. కాని ఆసమయంలో అతనిదృష్టి చిత్తరువు మీదికి తిరిగేసరికి పట్టరాని ఉక్రోషంతో అక్కడినించి లేచి వెళ్ళిపోయింది! ఆమెకు తనమీద కలిగిన గాఢానురాగాసూయలు తెలుసుకొని అమరుకదేవు డామెమీద జాలి పడ్డాడు. కాని ఆ విషయమైనా గ్రహించకుండా ఒక్కక్షణంలో ఆమె అక్కడినించి వెళ్లిపోయింది!

అదంతా తెలుసుకొని అతడొక వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. ఆ పార్శ్వంలో కనిపించిన మద్యపాత్రికలోని మద్యం అంతా ఒక్క గుక్కలో తాగివేసి కింశుకప్రభ తనకు బహూకరించిన చిత్రఫలకం వైపు చూస్తూ కూర్చున్నాడు.

పిమ్మట ఒక అంతఃపురపరిచారిక అక్కడికి వచ్చి శిరస్సుపై దోసిలివొగ్గి సవినయంగా విన్నవించింది:

"మహాప్రభూ! ఇది భృగువాసర రాత్రి. ఈనాడు క్రమప్రకారం అంగరాజకుమారిక వారం! ద్యూతక్రీడలో కమలారాజ్ఞి యీ రాత్రి గెలుచుకొన్న విషయం తమకు విదితమేగదా! ఇక తలకట్టుకుని కోపగృహంలోనికి వేంచేసిన దేవేరిగారు తమపై ఎంతైనా అలక వహించివున్నారు! అది అత్యంత ముఖ్యమైన విషయమని నేను వేరే విన్నవించవలసిన అవసరమేమీ లేదుగదా! ఆపైన మరి దేవరవారి చిత్తం!"

ఆమె ఆనాటిరాత్రి అమరుకభూపతి ప్రత్యేకంగా సందర్శించవలసిన అంతఃపుర రాణుల పేరులన్నీ వరసగా ఏకరువుపెట్టింది. అతడొకసారి ఆమెవైపు చూచాడు. అంతఃపుర పరిచారిక వెంటనే వెళ్లిపోయింది.

అమరుకదేవుని కేవిధంగా నిశ్చయించడానికీ మనస్కరించలేదు.

అతని హృదయం అంతకు పూర్వమే లీలావతి చూరగొన్నది.

కాని దేవేరి నొకమారు సందర్శించకపోతే ఆమె మరి ఆ కోపగృహమే తన నిత్యనివాసంగా ఏర్పరుచుకోవచ్చును! మిగిలిన రాణులవిషయంలో దేవేరికన్నా మరి రెండాకులెక్కువే చదివారు!

క్షణకాలం అతడా రాణులందరిని గురించి ఆలోచించాడు. కాని అతని హృదయం వారిమీద ఎంతోసేపు నిలవలేదు.

ఆ తరక్షణంలో అతనిదృష్టి తిరిగి లీలావతి చిత్తరువుపై పడింది.

అలభ్యమైన ఆమె రూపరేఖలు తలుచుకొని తలుచుకొని అతడొక దీర్ఘనిశ్వాసం విడిచిపెట్టాడు.

స్మృతి తప్పిపోయేవరకు సీధుపానంచేసి ఆ మైమరుపులో అతడా రహస్యమంత్రాగారంలోనే, మేనువాల్చి నిద్రించాడు.

—సశేషం.

మెక్లీన్సు యింతకు
ముందుకంటె పళ్లను తెల్లగా శుభ్రపరుచును!



ఆచార్య విభ్రాంతి

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

[గత సంచిక తరువాయి]

౪

అమరుకదేవునికి లీలావతిపైకలిగిన గాఢానురాగం అంతఃపురరాణులందరికీ కన్నెఱ్ఱగా మారింది. వారెవ్వరూ ఎన్నడు అతని అనురాగం అంతగాఢంగా చవిచూడలేదు. స్వతః అతని ప్రకృతి అంత లోతైనది కాదు. ఇంతకుపూర్వం అతని అనురాగము, అపేక్ష, మమకారము ఏ రాణిమీద పట్టుమని పది రోజులపాటైనా సుస్థిరంగా నిలబడలేదు! అలాంటప్పుడు ఒకమారు చిత్తరువులో చూచినంతమాత్రాన ఆయనకు లీలావతిపై అంతటి వల్లమాలిన ప్రేమకలగడానికి కారణమేమో! రాణులెవరికీ మహారాజు స్వభావంలో కలిగిన ఈ విచిత్ర పరిణామానికి కారణం తెలియలేదు. కొంతమంది రాణులదంతా వట్టి మూన్నాళ్ల ముచ్చట అని కొట్టిపారేశారు. ఇదంతా వట్టి నటనేలే! తీరా ఆ కొత్తరాణి రాణివాసం ప్రారంభించగానే మళ్లీ యథాప్రకారంగా పాతకథ ప్రారంభం అవుతుంది. మొదట్లో మామీదమాత్రం ఆయనకేమాత్రం అనురాగం కలగలేదు గనకనా?"

వారిలోవారలాగ సమాధానపడ్డారు.

ఇక కింశుకప్రభకీ లీలావతీ ప్రేమ మరింత విచిత్రంగా కనిపించింది. కింశుకప్రభ ఒకప్పుడు మహారాజు మమకారం గాఢంగానే చవిచూచింది. తరవాత అమరుకుని కామెపై ఏర్పడింది కేవలం ఉపేక్షాభావం మాత్రమే!

తలవని తలంపుగా మహారాజు తనకత్యంత సన్నిహితులయిన రసికులతోను, విట విదూషకులతోను కలిసి అంతఃపురకంలో రెండు మూడు సార్లు ఆమె నృత్య చాతుర్యం చూచి ఔనౌనని తల పంకించి వేనోళ్ల ప్రశంసించాడు. నిరాదరణ అవమానం భారంతో కుమిలి కృశించిపోతున్న కింశుకప్రభకొ ఆదరణఒక పెన్నిధిలా కనిపించింది. ఆ పరిస్థితులలో ఆమె తనపై అతని కటీవల ఏర్పడిన ఆసక్తి అలాగే నిలవరించుకోవాలని అనేకవిధాల ప్రయత్నించింది. లీలావతికథ విన్నతరవాత కింశుకప్రభ కామెపై ఈర్ష్యాసూయలు కలగకపోలేదు! కాని అమరుకదేవుని కామె మీద కలిగిన ఆసక్తి కేవలం తాత్కాలికమే అని ఆమె నిశ్చయించింది. అందుచేతనే తనకు లీలావతిపై కలిగిన ఈర్ష్యాసూయ లలాగే దిగమింగి అతి కష్టం మీద ఆమె చిత్తరువొకటి సంపాదించి ఎంతో ఆప్యాయంగా అమరుకదేవునికి బహూకరించింది. అది గ్రహించిన అమరుకదేవుని కామెయెడల జాలికలగక పోలేదు కాని అతనిచిత్తం లీలావతీ గాఢానురాగపాశబద్ధమై వివశమై పోయింది!

అది హఠాత్తుగా గ్రహించిన కింశుకప్రభ నిష్కారణంగా కొరివితో తల గోక్కున్నానని పశ్చాత్తాపపడింది. కాని చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకుంటే ఏమిలాభం?

మహామాత్యుడు రాజ్యవర్ధనునికిది మరింత పెద్ద విషమసంధిగా కనిపించింది. విదర్భదేశాధిపతి తనకుమార్తె నమరుకదేవునికిచ్చి వివాహం చెయ్యడానికంగీకరించలేదు. కాని ఇరుగుపొరుగు రాజ్యమైన మాళవంతో విరోధానికి వెరిచి ఆ మహారాజును స్వయంవరానికిమాత్రం ఆహ్వానించాడు. అంతే! అమరుకదేవుడు స్వయంవరయాత్ర మిషతో సైన్యాలన్నీ సమాయత్తపరచవలసిందని ఆజ్ఞాపించాడు. అంతేగాని తన నిజ సంకల్పం మాత్రం రాజ్యవర్ధనునికి తెలియనీయలేదు. కాని రాజ్యవర్ధనుని కతనిసంకల్పం గ్రహించడానికట్టేకాలం పట్టలేదు. లీలావతిని రాక్షసవివాహ మర్యాదతోనైనా వివాహమాడితీరాలని మహారాజు నిశ్చయించుకున్నాడని మహామాత్యుడిట్టే పసికట్టివేశాడు. దానివల్ల మాళవ విదర్భ దేశాల మధ్య ఏర్పడిన సామరస్యం చెడి తిరిగీ వైమనస్యంగా ప్రబలవైరంగా పరిణమించగలదని అతడు భయపడ్డాడు. అందుచేత మహారాజంతగా మనసిచ్చి మాట్లాడక పోయినా సైన్య సన్నాహాలతో స్వయంవరయాత్రకు తరలివెళ్ళడం సముచితంకాదనీ దానివల్ల అనేకమైన అపోహ లేర్పడవచ్చుననీ అన్నాడు. అమరుకదేవు డదివిని అతి హేళనగా ఒకనవ్వు నవ్వాడు.

"మీకాభయం అక్కరలేదు! అవన్నీ నేను చూచుకుంటాను. రాజ్యం వీరభోజ్యం అంతేగాని భీరుభోజ్యం కాదు! మీరిక వెళ్ళవచ్చును."

అంతపరుషంగా మహారాజు మాట్లాడినప్పుడిక రాజ్యవర్ధనుడేమీ అనలేక తలవంచుకుని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి చల్లచల్లగా అక్కడినించి జారుకున్నాడు.

అతని హృదయంలో మళ్ళీ మథన ప్రారంభమయింది. మహారాజు పూర్వం రాజ్యవ్యవహారాలన్నీ తనమీద విడిచిపెట్టి యథేచ్ఛగా భోగవిలాస లాలసలో మైమరిచేవాడు. ఎన్నివిధాల చెప్పినా రాజ్యవ్యవహారాలేవి చెవికెక్కనిచ్చేవాడు కాదు.

ఇప్పుడది మరింత మితిమీరిపోయింది.

కొన్ని వ్యవహారాలేమైనా తరిచి తరిచి అడిగితే వాటికన్నిటికీ అంటీఅంటని సమాధానాలేవో చెప్పి తప్పించుకోవడం మొదలుపెట్టాడు. మరికొన్ని వ్యవహారాలతని కేమీ జ్ఞాపకమున్నట్లే కనబడలేదు!

పూర్వకాలంలో ఏదైనా ఒక ముఖ్య వ్యవహారం పరిష్కరించవలసివస్తే తన మాట ప్రకారమే నడుచుకునేవాడు. ఇప్పుడదంతా తారుమారయింది. మహారాజు భోగవిలాసాలానాటికానాడు పెచ్చుపెరిగిపోయాయి. పైగా ముఖ్య వ్యవహారాల్లో

తనతో ఒకమాటయినా అనకుండా యథేచ్ఛగా ఇష్టంవచ్చినట్టు సంచరిస్తున్నాడు. ఇక దైనందిన రాజ్యపరిపాలనగూడా పట్టించుకోవడం మానివేశాడు. వాటి విషయం ఎత్తితే అతని కెక్కడలేని చిరాకు, విసుగు పుట్టుకొస్తున్నాయి. ఒకవేళ ఏదయినా సమాధానం ఇచ్చినా దానిలో పూర్వాపర సంబంధం లేదు! ఆ విస్మృతికీ, విసుగుదలకు అసలు కారణ మేదో మహామాత్యుని కేమీ అంతు చిక్క లేదు.

అతని కేమీ పాలుపోక మిగిలినమంత్రులతో ఆ విషయం ముచ్చటించాడు. వారిలో కొందరది తేలికగా కొట్టిపారేశారు. "దేవరవారి దివ్యచిత్తాని కొక దారి తెన్ను ఉండాలనుకోవడమే ఒక పెద్ద పొరబాటు! మారుమాట్లాడకుండా వారి సంకల్పప్రకారం నడుచుకోవడమే మన విధ్యుక్తధర్మం! మహారాజు తామై ప్రశ్నిస్తే ఏదైనా తోచిన సదుపదేశం చెయ్యడంవరకే మనధర్మం! అంతే!"

కాని రాజ్యవర్ధను డంతటితో సంతృప్తిపడి ఊరుకోలేదు. మహారాజు హృదయములో ఇటీవల బయలుదేరిన యీ విపరీత పరిణతి కేదో ప్రబలకారణం ఉండితీరాలని నిశ్చయించాడు. రాజవైద్యుల్ని కొందరిని పిలిచి మహారాజు చిత్తవిభ్రాంతిని గురించి చర్చించాడు. వారదంతా క్రమక్రమంగా దానంతట అదే కుదటపడగలదని సమాధానాలిచ్చారు. రాజ్యవర్ధనుడికి చేయగలిగినదేమీ లేక వారిమాటప్రకారం కొంతకాలంవరకు వేచివుండడమే మంచిదని నిశ్చయించుకొన్నాడు.

విదర్భదేశాధిపతి తన కుమార్తె లీలావతిని అమరుకదేవుని కిచ్చి వివాహం చెయ్యడాని కంగీకరించకపోవడానికొక కారణం లేకపోలేదు. అమరుకుడసలే భోగలాలసుడు. ఆపైన అతనికప్పుడే సుమారు నూరుగురుదాకా రాణులున్నారని ఒక లోకప్రవాదం బయలుదేరింది. బహుభార్యాత్వం ఆనాటి మహారాజ సంప్రదాయమే! అయినా తన కుమార్తె సుఖం ఆలోచించి అతడమరుకుని వివాహసంబంధాని కంగీకరించలేదు! కాని దానివల్ల అమరుకదేవునితో బలవద్విరోధం ఏర్పడగలదని అతనికి భయం కలగకపోలేదు. కాని అతడది లెక్క చెయ్యలేదు. అలాగే భీష్మించుకుని కూర్చున్నాడు. ఇటీవల అమరుకుని కేదో కొంచెం చిత్తచాంచల్యం కలిగినదని కూడా అతనికి తెలిసింది. దానితో అతనికి మరింత గట్టి పట్టుదల పట్టుకుంది. ఏది ఏమైనా సరే! లీలావతి నమరుకదేవుని కిచ్చి వివాహం చెయ్యకూడదని గట్టిగా నిశ్చయించుకొన్నాడు.

అప్పటి విదర్భరాజధాని పద్మనగరం రాజకుమార్తె లీలావతి స్వయంవర సన్నాహకోలాహలంతో నూతన తోరణాలంకారాలతో కలకలలాడింది. స్వయంవరార్థం విచ్చేసిన రాజకుమారులంతా తమకోసం ప్రత్యేకంగా అమర్చిన సింహాసనాలమీద కూర్చుని లీలావతి సందర్శనంకోసం అనుక్షణము ఎదురుచూస్తున్నారు. అమరుకదేవు డామె రాకకోసం మరింత ఆత్రంగా ఎదురుతెన్నులు చూచాడు.

చివరికి నూతన వధూవేషంతో కలకలలాడుతూ లీలావతి ప్రత్యక్షమయింది. ఆమె సౌందర్యం చూచిన రాజకుమారులలాగే నిశ్చేష్టులై శిలాప్రతిమ లయినారు. అమరుకదేవుని కామె చిత్తరువులో, ఆమె సౌందర్యంలో

★ ఆశ్చర్య విభ్రాంతి ★

లవలేశంకూడా ప్రతిఫలించలేదని అనిపించింది!

లీలావతి స్వయంవరమాలిక చేత ధరించి నెమ్మదినెమ్మదిగా అడుగులు వేసుకుంటూ నడిచివస్తూంది. ఆమె చెలికత్తె ఇరుపురుడిర్చి కూర్చున్న రాజకుమారులలో ఒక్కొక్కరివైపే చూచి సంగ్రహంగా వారివారి గుణగణాలు లేకరువుపెడుతూంది.

క్రమక్రమంగా లీలావతి అమరుకదేవుని సింహాసనం సమీపించింది. అతనితోబాటతని పార్శ్వాల కూర్చున్న రాజకుమారులంతా ఆమె స్వయంవరమాలిక ఉత్తరక్షణంలో తమ కంఠాలలంకరించగలదని ఎంతైనా ఉవ్విళ్లూరారు. కాని అలాంటిదేమీ జరగలేదు. ఆమె వారి నందరినీ అతిక్రమించి వెళ్లిపోయింది! అయినా రాజకుమారులంతా పైపైకలాగే చిరునవ్వులు చిలకరించారు. అమరుకదేవుని కది సాధ్యం కాలేదు. ఎలాగో అలాగ శ్రమపడి ఒక్క విషపు నవ్వు నవ్వగల్గాడు. లీలావతి చెలికత్తెతో కలిసి హేలగా అలాగే మున్ముందుకు సాగిపోయింది. ఒక రాజకుమారుని సింహాసనం దగ్గర కొంతసేపు నిలబడింది. అది గ్రహించి చెలికత్తె అతని గుణగణాలనే పనిగా పొగడడం మొదలు పెట్టింది. లీలావతి చెక్కిళ్లెర్రబడ్డాయి. ఆమె స్వయంవరమాలిక నెమ్మదిగా ఆ రాజకుమారుని కంఠంలో అలంకరించబోయింది.

అంతలో రాజకుమార పంక్తిలో ఒక పెద్ద గగ్గోలు బయలుదేరింది. వారందరు తమ తమ సింహాసనాలు దిగి ఆ కల్లోలానికి కారణం తెలుసుకోడానికి ప్రయత్నించారు. క్షణంలో వారి కది అంతా అవగాహన అయింది.

లీలావతి తన సింహాసనందాటి మున్ముందుకు సాగిపోగానే అమరుకదేవు డిక తన సింహాసనంపై కూర్చోలేక పోయాడు. మరి కొంత సేపటికి లీలావతి స్వయంవరమాలిక ఇంకొకరి కంఠం అలంకరించబోతున్నదని గ్రహించాడు. మరుక్షణంలో లీలావతిని హఠాత్తుగా చేజిక్కించుకొని తన రథం మీదికి వెళ్లిపోయాడు. అంతంతకు అమరుకదేవుని విడిదిలో పరిచారకులుగా అధికారులుగా మారువేషాలు ధరించిన సైనికులంతా నిజస్వరూపాలతో అతని రథం పక్కనే యుద్ధసన్నద్ధులై నిలిచారు.

అప్పటికి సూర్యాస్తమయం అయింది. అమరుకదేవుని సైనికులు, విదర్భదేశాధిపతి సైనికులు ఒకరొకరితో యుద్ధానికి తలపడ్డారు. క్రమంగా బాగా చీకటి పడింది. విదర్భదేశాధిపతి సైనికులు స్వయంవర మహోత్సవం సన్నాహంలోపడి వివిధ వినోదాలతో వినోదిస్తున్నారు. వారెవ్వరూ హఠాత్తుగా యుద్ధం తమపై విరుచుకుపడగలదని అనుకోలేదు! అమరుకుని సైనికులంతా సర్వసన్నద్ధులై అక్కడికి వచ్చారు. అనుక్షణము యుద్ధంకోసం ఎదురుచూస్తున్నారు. అందుచేత ఆ సంకుల సమరంలో వారిదే పైచేయి అయింది. అయినా అమరుకదేవుని సైనికుల్లో చాలామంది ఆ యుద్ధంలో మరణించారు. అమరుకదేవు డతి కష్టంమీద లీలావతితో సహా తన రాజధానికి తిరిగిరాగలిగాడు.

అటుపిమ్మట రెండు రోజులలో వారిద్దరికీ యథావిధిగా వివాహం జరిగిపోయింది. ఆ వివాహంలో లీలావతి ఇష్టానిష్టాల విషయం ఎవరు తలపెట్టలేదు. ఆ విధంగా వివాహమాడడం ఆ రోజుల్లో సుక్షత్రియ ధర్మం! అందుచేత అమరుకదేవుని అత్యద్భుత సాహసం విని అందరు వేనోళ్ళ ప్రశంసించారు. అతడావిధంగా అత్యద్భుత శౌర్యసాహసాలు ప్రదర్శించి శత్రువులందరినీ చెండాడి లీలావతిని రాక్షసవివాహమర్యాద చేజిక్కించుకురావడమే వారి కత్యాశ్చర్యకరంగా కనిపించింది.

అంతేనేగాని లీలావతికది అంగీకారం అవునో కాదో వారెవ్వరు ఆలోచించలేదు! అందరుఅమరుకదేవునినూతనకళ్యాణోత్సవాల కోలాహలంలోపడిఆవిషయ మేవిస్మరించారు.

ఇక లీలావతిమాట! ఆమె మొట్టమొదట ఆ ఆఘాతానికి తట్టుకోలేక అమరుకదేవుని రథంమీదే స్పృహతప్పి పడిపోయింది. తరవాత అతని అంతఃపురంలో కళ్లు తెరిచి నాలుగువైపుల పరకాయించి చూచింది. ఉత్తరక్షణంలో ఆమె కదంతా అవగాహన అయింది. కాని ఆమె మరి మాటలాడలేదు! ఒకమారు తన దురదృష్టం నిందించుకొని గుడ్లనీరుకుక్కుకుంది. వివాహసమయంలో కూడా ఆమె పెదవులపై ఒక చిన్ని చిరునవ్వైనా చిగిరించలేదు!

వివాహం జరిగిన ఒకపక్షం రోజులవరకు ఆమె ముఖవైఖరిలో మార్పేమి గోచరించలేదు. కాని అమరుకదేవు డామె అనుగ్రహం సంపాదించడానికెన్నెన్నోవిధాల ప్రయత్నించాడు. అనుక్షణము ఆమె కేలోటు రానీయకుండా కంటికి రెప్పలా చూడవలసిందని అంతఃపుర పరిచారికలకు ఆజ్ఞాపించాడు.

లీలావతి అంతఃపురంలో అడుగుపెట్టినప్పటినించీ అతని దృష్టిఅంతా ఆమెమీదనే లగ్నమయింది. అంతేకాదు! ఆపైన మరి ఒక మాసంరోజులు గడిచిపోయినా అతని వైఖరిలో మార్పేమీ గోచరించలేదు. అప్పటికి లీలావతి పెదవులపై చిన్ని చిన్ని చిరునవ్వులు చిగిరించడం మొదలు పెట్టాయి. అమరుకదేవు డిక తనవంటి అదృష్టశాలి ప్రపంచంలో ఇంకెవరు లేరని సంతోషించాడు. ఇక లీలావతి కనుసన్నలలో మెలుగుతూ మిగిలిన అంతఃపుర రాణులమాటే మరిచి పోయాడు. ఆ ధోరణిచూచి మిగిలిన రాణులందరు ఆశ్చర్యపోయారు. కొత్త రాణి అతిలోక సౌందర్యమే అతని నంతగా ఆకర్షించినదని కొంచెం సమాధానపడ్డారు. మరి కొంద రామె చాలా అదృష్టవంతురాలని అసూయపడ్డారు.

అప్పటికావివాహం జరిగి ఇంచుమించుగా ఒక నెల రోజులకాలం గడిచిపోయింది. అప్పటి కమరుకదేవుకు లీలావతి బాగా కుదటపడిందని సంతోషించాడు.

కాని మరి కొంత కాలానికి లీలావతి క్రమక్రమంగా చిక్కి శల్యమైపోయింది. ఆమె తన శయ్యమీదనించి లేచి నాలుగడుగులు వెయ్యడమే గగనమైపోయింది. ఆమె ఆ విధంగా క్షీణించి చిక్కి శల్యమైపోవడానికి కారణ మెవరికీ తెలియలేదు. చివరికి రాజవైద్యుల ప్రత్యేక ప్రక్రియలు కూడా పనికిరాలేదు. ఆమె అలాగే చిక్కి శల్యమైపోయింది. అసలామె రుగ్మతకూడా ఎవరికీ అంతుబట్టలేదు. లీలావతి పెదవుల మీది చిరునవ్వూ, ముఖలావణ్యము మాత్రం క్షీణించలేదు. అంటే, కొంద రామె దురంతచింతతో ఆవిధంగా కృష్కించిపోయినదని అన్నారు! మరి కొంద రామె కమరుకదేవునితో వివాహం బొత్తిగా సరిపడలేదని గుసగుస లాడారు. మరి కొందరామె రహస్యంగా విషం పుచ్చుకొని ఉండవచ్చునని అనుమానించారు. అమరుకదేవు డామె శయ్యపక్కనే నిలబడి అనుక్షణము కంటికి రెప్పలా కాపాడుతూ కాయకష్టలా వైద్యం చేయించాడు. కాని ప్రయోజనమేమీ కలగలేదు. ఒకనాటి అర్ధరాత్రి ఆమె అలాగే చిరునవ్వుతో కళ్ళుమూసింది. అది చూచి అమరుకు డక్కడే కూలబడి పోయాడు.

౬

అతనికా ఆఘాతంతో ఒక పెద్ద పిడుగు మీద విరుచుకుపడినట్లయింది. అంతకు పూర్వం అత డెప్పుడు అంత హృదయాఘాతమే చవిచూడలేదు! ఆ దుఃఖాఘాతంతో అతడొక్క మారు కళ్లు తెరిచి చూచాడు! జీవితం అంతా అతని కొక్కమారుగా దుఃఖభూయిష్ఠమై అనిత్యమై పోయినట్లు స్ఫురించింది. తన భోగలాలస నిత్యవినోదాసక్తు లన్నీ కేవలం అర్థరహితంగా వ్యర్థంగా కనిపించాయి.

జీవితంలో అందరికీ అడుగడుక్కీ తీవ్రమైన దుఃఖ ఆఘాతాలు తగులుతూనే ఉంటాయి. కాని ఆ ఆఘాతాలకే వేవో అర్థాలు చెప్పుకుని అనేకులనేక విధాలుగా సంతృప్తి పడుతూ అలాగే జీవితయాత్రలు సాగిస్తూంటారు. ఒక్కొక్కరికి ఒక్క శోకాఘాతంతో జీవితం అంతా నిస్సారమై పోయినట్లు స్ఫురిస్తుంది. అమరుకుడంతకు పూర్వం అనేక వివాహాలు చేసుకున్నాడు. కాని వారెవరి మీద అతని కంతటి గాఢానురాగం ఏర్పడలేదు. తలవని తలంపుగా లీలావతి మీదనే అతని కంతటి గాఢానురాగం కలిగింది. అయితే ఆమె అప్పుడప్పుడే వికసించిన క్రొవ్విరిలా అతని హృదయం అలంకరించి అంతలోనే వాడి నేలపై రాలిపోయింది. అమరుకుని కామె హృదయం అన్యాయత్తమై ఉండ వచ్చునని అనుమానం కలిగింది. అయినా ఆమె యెడల అతని అనురాగం కొంచమైనా వాడిపోలేదు. కనకనే ఆమె మృతితో అతని కంతటి తీవ్రావేదన కలిగింది. ఆ ఆవేదన అతని కంత గొప్ప కనువిప్పు కలిగించింది.

అతడప్పటినించీ పూర్వ భోగలాలసలన్నీ పూర్తిగా విసర్జించి వేశాడు. లీలావతి మృత్యుజిజ్ఞాస అతని అంతరాంతరాలలో ఒక పెద్ద సంక్షోభం రేకెత్తించింది. అమరుకుడప్పటినించి విద్యావయోవృద్ధులతో వేదాంత చర్చ లారంభించాడు.

వేదాంత వేత్తలనేక విధాలుగా అతనికి దుఃఖోపశమనం కలిగించడానికి ప్రయత్నించారు. వారి వేదాంత సూక్తులుగాని, ఉపశమన వాక్యాలుగాని అతని హృదయంలోని చిచ్చార్పలేకపోయాయి.

ఎంతసేపు అతనికొకటే జిజ్ఞాస! లీలావతి ఎక్కడికి వెళ్ళిపోయింది? మరుమరీచికలై స్ఫురించే జీవనమరణాల అంతరార్థ మేమిటి? తానెవరు? ఆమె వియోగం తన హృదయాంతరాళాన్నింగా దొలిచివేయడానికి కారణమేమిటి? తిరిగి లీలావతి ఎవరు? అసలీజీవితపరమార్థ మేమిటి? ఇటువంటి ప్రశ్నలెన్నెన్నో అనుక్షణము అతని హృదయంలో ఆరని జిజ్ఞాసాగ్ని ప్రజ్వలింపజేశాయి. ఎంతమంది తత్త్వవేత్తలెన్ని విధాల సమాధానపరిచినా అతని హృదయవేదనాజ్వాల చల్లారలేదు. ఆ కారణంవల్లనే అతని దర్శనం అంతఃపురస్త్రీలకే గాక మంత్రులకుగూడా దుర్లభమైపోయింది.

ఒకనాడు రాజ్యవర్ధను డేదో అత్యవసర వ్యవహారంమీద మహారాజదర్శనానికి వస్తున్నానని కబురు పంపించాడు. ఎంత రుచించకపోయినా అమరుకదేవునికి తన నిదర్శనం ఇవ్వక తప్పలేదు. రాజ్యవర్ధనుడు లోపలికి వస్తూనే ఎంతో ఆత్రంగా మాట్లాడాడు:

"మహాప్రభూ! విదర్భదేశాధిపతి సైన్యాలతో సహా మనమీదికి దండెత్తి వస్తున్నారట! ఆయన తమ కుమార్తె మృతికి తగిన ప్రతీకారం చెయ్యడంకోసమే ఈవిధంగా మనపై విరుచుపడుతున్నారట!"

ఆమాటలువిని అమరుకదేవుడొక్కమారుగా విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు. ఆ ధోరణిచూచి రాజ్యవర్ధనుడతనికి పూర్తిగా మతిభ్రమణమే కలిగిందని అనుమానించాడు. అంతలో మహారాజు తనవెర్రినవ్వాపి వేశాడు:

"రానివ్వండి! దానికేం! నేను యుద్ధమే కోరుకుంటున్నాను! వారు సరిగా సమయానికే వచ్చారు! మీరు వెంటనే వెళ్లి సైన్యాలన్నీ సమాయత్తపరచండి! వెళ్లండి!"

రాజ్యవర్ధనుడతని మాటలు విని మరింత ఆశ్చర్యపోయాడు. వెనువెంటనే సైన్యసన్నాహప్రయత్నంలో పడ్డాడు.

దుఃఖోద్వేగంవల్ల అమరుకుని కప్పటి జీవితం కేవలం దుర్భరమైపోయింది. ఆ సమయంలో విదర్భసైన్యాధిపతితో యుద్ధంచేసి వీరస్వర్గం పొందగోరడమే సముచితమని అతనికి స్ఫురించింది. కాని పైపైకా సంకల్పం ఎవరికీ తెలియనీయకుండా వెంటనే యుద్ధప్రయత్నంలో పడ్డాడు. ఆ ప్రయత్నతన్మయతలో మైమరచిన అతనికి తాత్కాలికంగా కొంతవరకు దుఃఖోపశమనం కలిగింది.

—సశేషం.

ఆచార్య విభ్రాంతి

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౮

[గతసంచిక తరువాయి]

విదర్భాధిపతి తన అపార సైన్య సంపత్తితో మాళవ రాజధాని మీదికి దండెత్తి వచ్చాడు. క్రమక్రమంగా ఆ విషయం అమరుక దేవునికి పూర్తిగా స్పష్టపడింది. అయినా అతడెక్కడా చెక్కు చెదరలేదు! శాయశక్తులా యుద్ధ ప్రయత్నాలు చేయించాడు. అంతవరకు వినోద విలాసాలలో మునిగి తేలుతున్న మాళవ రాజధానిలో ఆ వార్త ఒక్క మారుగా దిగ్భ్రాంతి కలిగించింది!

విదర్భ సైన్యాలతో పోలిస్తే మాళవ సైన్యం అత్యల్పమనీ, అమరుక దేవుని కా యుద్ధంలో పరాజయం తప్పదనీ రాజ్య వర్ధనుడు భయపడ్డాడు. అయినా అతడు మహారాజాజ్ఞ ననుసరించి రాత్రింబవళ్ళే పనిగా యుద్ధసన్నాహాలు చేయించాడు.

ఆయుద్ధంలో తనకిక ఘోర పరాజయం తప్పదనీ, అయినా వీరమరణమే శరణ్యమనీ, తన కాపరిస్థితిలో అదే మహాభాగ్యమనీ అమరుకదేవుడొక స్థిరనిశ్చయానికి వచ్చాడు.

అతడు లీలావతి మృతి క్షణంవరకు జీవిత భాగ్యభోగాలన్నీ యథేచ్ఛగా అనుభవించాడు. ఆ ఆనందతన్మయతతో మైమరిచి తదితర విషయాల గోడే విస్మరించాడు. అయితే లీలావతి మృతితో అతని జీవితాని కొక బలమైన బల్లెపుపోటు నాటుకుంది. చూస్తూ ఉండగానే సమస్తము కలకరిగి పోతున్నట్టు స్ఫురించింది.

ఆ పైన మీద మీద విరుచుకు పడనున్న సమర పరాజయ బీభత్సంలో అతనికి ఆ రాజ్యం భాగ్యభోగ్యాలు అన్నీ కేవలం మూరు మరీచకలే అని తోచింది.

రాజ్యానికి వచ్చిన కొత్తలో అతడు విద్యా వయో వృద్ధుల వేదాంతోపదేశాలు, పౌరాణిక సూక్తులు వినక పోలేదు. కాని ఆ సమయంలో అవేవీ అతని చెవి కెక్కలేదు! లీలావతి మృతితో ఆ ఉపదేశాల అంతరార్థం అతనికి కొంతవరకు స్పష్టపడింది. నేడో రేపో పెను ప్రళయమై విరుచుకు పడనున్న మహాయుద్ధబీభత్సంలో ఆ వేదాంతోపదేశాలతని కళ్ళ కెదురుగా భీకర శిలాక్షరాలై నిలిచాయి!

తాను ఎవరో! నిత్యము మహానదీ ప్రవాహంలా పరవళ్లు దొక్కుతూ మున్ముందుకు సాగిపోయే జీవిత పరమార్థమేమో! నిరంతర ద్వంద్వాలై భాసించే జీవన మరణాలకు, సుఖదుఃఖాలకు, లోలోపల అనుస్యూతమై వెలిగే పరమ రహస్యమేమో!

ఆ విషమైన మథన క్షణక్షణము, అతని అంతరాంతరాలలో ఎలుగెత్తి ఘోషించింది.

కాని అమరుకునికా మథన సమన్వయించే మార్గమేదీ కనబడలేదు. కాని ఆ సందేహాలన్నీ పట్టుకుని వేధించడం మాన లేదు. ఇక గత్యంతరం లేక అతడు నిరంతర మదిరాపానంతో మత్తెక్కి మైమరిచాడు!

ఒక నాటి సాయంకాలవేళ రాజ్యవర్ధనుడెంతో ఆత్రంగా అతని దగ్గిరికి పరుగెత్తుకు వచ్చాడు:

“మహాప్రభూ! శత్రువులు పురద్వారం సమీపిస్తున్నారు! వారి అపార సేనావాహిని ఎంతో ఎవరు లెక్కపెట్టలేక పోతున్నారు!”

మహామాత్యుడలాగే తెల్లబోయి నిలుచున్నాడు. అమరుకుడతని భయోద్వేగం గమనించి గట్టిగా గర్జించాడు:

“ఈయుద్ధంలో నేనే స్వయంగా సేనాధిపత్యం వహిస్తున్నాను. రణభేరి మ్రోగించి సైన్యాలన్నిటికీ జైత్రయాత్రఘోషించండి! ఆలస్యాదమృతం విషం! కదలండి! అలాగ నిర్ఘాంతపోయి చూస్తారేమిటి?”

రాజవర్ధనుడొక్క అంగలో అక్కడినించి కదిలి వెళ్ళిపోయాడు. అమరుకుడా విధంగా కళ్లు మూసుకుని యుద్ధరంగంలో దురకగలడని అతడెన్నడు ఊహించలేదు! తీరా యుద్ధప్రళయమే ముంచుకువస్తే,మహారాజేదో విధంగా సంధిమార్గం అవలంబింపక పోడని అతని నమ్మక! నిత్యము భోగలాలసతోను, అలసతతోను మైమరచిన అతడా విధంగా కళ్ళు మూసుకుని రణరంగంలో దురకగలడని మహామాత్యుడు కలనైనా ఊహించలేదు! ఇప్పుడతని ఊహాలన్నీ వట్టి అపోహాలై ఎగిరి పోయాయి!

మహామాత్యు డమరుకునికి శత్రుసైన్య వార్త వినిపించేసరికి సాయంకాలం గోధూళి వేళ సమీపించింది.

ఆ రోజుల్లో రాత్రి వేళ యుద్ధం ధర్మ సమ్మతం కాదు. అందుచేత మాళవ విదర్భ సైన్యాలు రెండు ఆ మరునాటి ఉదయం ప్రారంభింపబోయే మహాయుద్ధానికి ఉవ్విళ్ళూరుతూ మహోత్సాహంతో ఎదురుచూస్తున్నాయి.

అమరుకు డానాటి రాత్రి తెల్లవార్లు మేలుకునే ఉన్నాడు. సైన్యాధిపతులందరికీ ఆ యా సమయాలలో అనుసరించవలసిన యుద్ధ పద్ధతులు, వ్యూహరచనలు వేర్వేరుగా వివరించి బోధించాడు. వారంతా అతని అచంచల ధైర్యము, వ్యూహరచనా నైపుణి చవిచూచి నిర్ఘాంతపోయారు. అతని ధైర్యోత్సాహాల ధోరణి చూడగానే వారికి కూడా కొండంత ధైర్యం కలిగింది. శత్రువు లెంత సైన్యంతో దండెత్తి ఎత్తివచ్చినా వారిని జయించి తీరగలమని గుండెనిబ్బరం కలిగింది.

ఆ మరునాటి ప్రాతఃకాలం వేళ రణభేరి బీభత్సంగా మార్మోగింది. అమరుకు డొక మారంతఃపురం వైపువెళ్ళాడు. అతని యోధ వేషం చూచి రాణులందరు చుట్టూ గుమిగూడారు. అమరుకదేవుడు కొంతసేపం దరితోను అంటీ అంటనట్లుగా ఇష్టాగోష్ఠి జరిపి వెనువెంటనే అక్కడినుంచి కదిలి వెళ్ళి

పోయాడు. అతని భలోక్తుల ధోరణిని బట్టి రాణులు మహారాజెంతో ఉల్లాసంగా ఉన్నాడని గ్రహించారు. యుద్ధంలో మాళవదేశానికే దిగ్విజయం కలగ గలదని నిశ్చయించారు. అయినా దిగ్విజయం కోరుతూ గృహ దేవత లందరికీ బలులర్పించి పూనజాపు స్కారాలు చేయించారు.

౮

ప్రయాణ రణభేరీధ్వని గంభీరంగా మారు మోగింది. అమరుక దేవుడు క్షణంలో తన ఉత్తమాశ్వం పైకెక్కి కూర్చున్నాడు. తిరిగీ రణభేరి గంభీరంగా మారుమోగింది. మాళవ సైన్యాలన్నీ యుద్ధరంగాని కురకలు వేసు కుంటూ పరుగులు పెట్టాయి. భేరీ ధ్వనులు అదేపనిగా మారుమోగుతున్నాయి. అమరుకు డొక్కమారు వెనుతిరిగి చూచాడు. ఒక్క వేడినిట్టూర్పు విడిచి పెట్టాడు. లీలావతి రాజ ప్రాసాదంపై నిలబడి అతనివైపు రెప్పపాటు లేకుండా తిలకిస్తున్నట్టు కనబడింది. అమరుకుడు మళ్ళీ ఇంకొకమారు పరిశీలనగా చూచాడు. ఈ తరక్షణంలో అది కేవలం భ్రాంతిమాత్రమే అని స్పష్టపడింది. అతని చెక్కిళ్ళపై రెండు కన్నీటిబిందువులు దిగజారాయి.

ఆ స్మరణతో అతనికి రణరంగంలో కురికి వీరస్వర్గం చూరగొనవలెనన్న సంకల్పం మరింత బలపడింది. తనకు, తన రాజ్యానికీ ఆ క్షణంతో ఋణం తీరిపోయినదని స్ఫురించింది.

అమరుకదేవుడు రణభేరీ కోలాహలంతో యుద్ధరంగంవైపు సాగిపోతూంటే రాజవీథ లలో ప్రాసాదాలపై నిలబడిన పుణ్యపురం ధ్రులతనిపై లాజపుష్పవర్షం కురిపించారు.

ప్రాచీనకాలంలో జైత్రయాత్రకు బయలు దేరే మహారాజులపై పేలాలు వెదజల్లి ఆశీర్వదించడం ఒక అనూచాన సంప్రదాయం. ఆ సంప్రదాయం ప్రకారమే రాజధానిలోని పుణ్యకాంతలందరు అమరుకదేవుని శిరస్సుపై లాజలతో కలిపిన ఆశీర్వర్షం కురిపించారు.

మహారాజా పుణ్యపురంధ్రులందరికీ సవినయంగా చేయెత్తి నమస్కరించాడు. ఆ క్షణంలో ఆ మహానగర రాజవీథులు మరి తన కంటబడవని అతనికి స్ఫురించింది.

మళ్లీ అతని హృదయంలో పూర్వస్మృతు లన్నీ వరసగా పురివిప్పి నృత్యంచేశాయి. ఆ మహానగరంలో తన జీవితం అంతా ఒక లిప్తలో గడిచి అదృశ్యమై పోయినట్లతనికి తోచింది. అతి డొక్క నిట్టూర్పు విడిచి నిశ్ప్రభావంతో అలాగే మున్ముందుకు సాగి పోయాడు. తన పూర్వ జీవితానుభూతులన్నీ పూర్తిగా విస్మరించి వెయ్యాలని నిశ్చయించుకొన్నాడు. కాని ఒక్క లీలావతీ స్మృతి మాత్రం అతని హృదయంలో నీడలా కదలాడడం మానలేదు.

సరిగా అదేసమయంలో విదర్భ దేశ సైన్యం ఒక్కుమ్మడిగా మాళవ సైన్యంమీద విరుచుకు పడింది. దానితో మాళవ సైన్యంలో అంతటా ఒక పెద్ద కోలాహలం చెలరేగింది. ఆధాటి కాగలేక మాళవసైన్యం కొంతసేపు వెనకంజ వేసింది.

అమరుకుడెలుగెత్తి తన సైనికులందరికీ హెచ్చరిక చేశాడు. విజయమో, వీర స్వర్గమో తప్ప మరి మధ్య మార్గమేమీ లేదని హుంకరించాడు. కళ్ళు మూసుకొని తానే మున్ముందుగా శత్రువ్యూహంలో చొర బడ్డాడు.

మాళవసైనికులాతని ధైర్య సాహస పరాక్రమాలు చూచి నిర్ఘాంతపోయారు. మళ్ళీ మహోత్సాహంతో విదర్భ సైన్యం లోలోపలికి చొచ్చుకుపోయారు. శత్రుసైనికులు వారిధాటి కాగలేక చెల్లాచెదరై పారి పోయారు.

మాళవ సైన్యంతో పోలిస్తే విదర్భ సైన్యం చాలా పెద్దది. మాళవసైనికు లల్పసంఖ్యాకు లయినా ధైర్యోత్సాహాలతో వీరవిహారం చేశారు. అపారపారావారంలా విస్తరించిన విదర్భసైన్యం మాళవసైన్య వీరవిహారధాటి కెదురొడ్డి నిలబడలేక చెదిరి పారిపోయింది. విదర్భ సేనాధిపతులందరికీ అది ఒక పెద్ద తలవంపయింది.

ఆసైన్యాధిపతులా అవమానం భరించలేక తమ సైన్యాల నొక్కచోటచేర్చి అనేక విధాలుగా ప్రోత్సహించారు. కళ్లు మూసుకుని మళ్ళీ మాళవసైన్యంతో తలపడవలసిందని ప్రోత్సహించారు. అటుపిమ్మట గోధూళి వేళ వరకు ఉభయసైన్యాలకు ఘోర యుద్ధం జరిగింది.

ఆ ఘోరయుద్ధంలో మాళవ సైన్యంలో మరణించినవారి సంఖ్య క్షణక్షణానికి పెరిగి పోయింది. క్రమంగా మాళవసైన్యాధిపతు లందరికీ విజయాశ సన్నగిలింది. అయినా అమరుకదేవుడంతటితో నిరుత్సాహపడలేదు. ముందు వెనకలు చూడకుండా కళ్లుమూసుకుని శాత్రవసైన్యంలో చొరబడ్డాడు. విదర్భసైనికు లదనుకనిపెట్టి ఒక్కుమ్మడిగా అతనిమీద కురికారు. అమరుకుడు వారిలో చాలామందిని హతమార్చివేశాడు.

కాని ఆ సంకుల సమరంలో అతని శిరస్సుపై ఒక పెద్ద గదాఘాతం తగిలింది.

★ ఆచార్య విభ్రాంతి ★

ఆ అఘాతానికి తట్టుకోలేక అతడలాగే తన అశ్వంమీద కూలబడిపోయాడు.

అమరుకదేవుని కొంతరవాత బాగా స్పృహతప్పిపోయింది.

అది కనిపెట్టి మాళవసైన్యాధిపతు లతనికి సహాయం చెయ్యడంకోసం శాయశక్తులా ప్రయత్నించారు.

అమరుకదేవునికి మరి ఆనాటి అర్ధరాత్రి వరకు స్పృహకలగలేదు. తిరిగి స్పృహ కలిగిన కొంచెం కళ్లుతెరిచి చూసేసరికి అతనికి తన పరిసరాలన్నీ అత్యాశ్చర్యంగా కనిపించాయి. కొంతసేపటివరకు అతడది మరి ఒకలోకమేమో అని భ్రమపడ్డాడు. అతని కనతిదూరంలో ఒక పన్నని దీపం వెలుగుతూంది. చుట్టూ యుద్ధకోలాహలం కొంచెమైనా వినబడలేదు. అంతా ప్రశాంతంగానే కనిపించింది. అతడొకమారు లేచి కూర్చుని నాలుగువైపులా పరకాయించి చూడాలని అనుకున్నాడు. కాని శరీరం స్వాధీనంకాలేదు. శరీరం కేసి చూసుకొన్నాడు. ఒళ్లంతా గాయాలే! కట్లే! అప్పటికతనికి తనపరిస్థితికి కొంతవరకు బోధపడింది.

అంతలో కింశుకప్రభ గుడ్ల నీరుగుక్కుకుని అతనికెదురుగా వచ్చి నిలబడింది. అమరుకు డామెవైపుచూచి క్షీణస్వరంతో ప్రశ్నించాడు.

"యుద్ధరంగంలోంచి నన్నెక్కడికి ఎవరు తీసుకువచ్చారు! మన సైన్యాలేమై పోయాయి?"

కింశుకప్రభ గద్గదస్వరంతో సమాధానం ఇచ్చింది:

"తాము రణరంగంలో మూర్ఛపోయారు! దైవశాత్తు అప్పటితో సూర్యాస్తమయ మయింది.

"మనసైన్యాధిపతులు మిమ్మల్ని భద్రంగా ఇక్కడికి తీసుకువచ్చారు."

కింశుకప్రభ సంగ్రహంగా యుద్ధరంగంలో జరిగిన విశేషాలతనికి తెలియజేసింది. శత్రుమధ్యంలో చిక్కుపడి మూర్ఛపోయిన అమరుకదేవుని సంరక్షణ మాళవ సైనికులకు మొట్టమొదట దుష్కరంగానే తోచింది. అయినా అతికష్టంమీద వారతని నెలాగో అలాగ సంరక్షించి సురక్షితంగా మాళవ సేనాస్కంధావారానికి చేర్చారు.

అటు పిమ్మట రెండుమూడు రోజులవరకు మాళవ విదర్భ సైన్యాలమధ్య ప్రచండయుద్ధం చెలరేగింది. అప్పటికి అమరుకదేవునికి కొంత స్వస్థత కలిగింది. కాని రాజ్యవర్ధనుడతనిని తిరిగి యుద్ధరంగంలోనికి పోనీయలేదు. సంపూర్ణారోగ్యం కలిగేవరకు మహారాజు మరి యుద్ధరంగంవైపైనా చూడరాదని రాజవైద్యు లాదేశించారు. అమరుకునికింకా పూర్ణారోగ్యం కలగలేదు. అందుచేత అతనికి రాజవైద్యుల ఆదేశం శిరసావహించక తప్పలేదు.

అయినా అతడు యుద్ధపరిస్థితులన్నీ అతి జాగరూకతతో గమనిస్తూనే ఉన్నాడు. అప్పటికి యుద్ధం ప్రారంభించి అయిదారు రోజులయింది. క్రమక్రమంగా మాళవ సైన్యం ధైర్యోత్సాహాలు నీరసించాయి. మాళవసైన్యాధిపతులందరు ఏదో విధంగా సామరస్యమార్గం అవలంబించడమే మంచిదని మహారాజుతో విన్నవించారు. అమరుకునికది మహావమానకరంగా తోచింది:

"ఈ పరిస్థితిలో సామరస్యపద్ధతి ఏదీలేదు! విదర్భాధిపతి కేవలం పగతీర్చుకోడానికే మనపై దండెత్తి వచ్చాడు. మనంచేసిన దానిలో క్షత్రియ ధర్మవిరుద్ధమయినది అణువంతయినా లేదు. ఇంతకీ మన తప్పేముంది? సామరస్యమార్గం అవలంబించవలసినది వారే కాని మనం కాదు!"

మంత్రులకు, సైన్యాధిపతులకు అతని మాటలలోని ఔచిత్యం గోచరించకపోలేదు. మహామాత్యుడు రాజ్యవర్ధనుడుకూడా ఆ పరిస్థితిలో అంతకన్న చేయగలిగినదేమీ లేదని అంగీకరించాడు. దానితో సైన్యాధిపతులందరు తలలువంచుకొని నిష్క్రమించారు.

తిరిగి మాళవ విదర్భ సైన్యాలమధ్య భీకర సమరం ప్రారంభమయింది. అమరుకు డణుక్షణము యుద్ధధోరణి జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉన్నాడు. ఆనాడు మాళవ సైన్యం చెల్లాచెదరై తిరిగి వచ్చింది. ఆ మరునాటితో

మాళవసైన్యానికి సంపూర్ణ పరాజయం తప్పదని అందరు నిరాశచేసుకున్నారు.

అమరుకుడానాటిరాత్రి అంతా మేలుకొనే ఉన్నాడు. ఆ మరునాడవసరమైతే తానే యుద్ధరంగలోకరిగి హతశేషులయిన సైనికులతోపాటు వీరస్వర్గం చూరగొనాలని నిశ్చయించాడు.

అప్పటి కర్ధరాత్రి గడచింది. అమరుకుడు తన రాజప్రాసాదంలో పై అంతస్తులో కూర్చుని శత్రుసైనికుల గుడారాలవైపు చూస్తున్నాడు. దూరదూరంగా యుద్ధరంగంలో మరణశయ్యలపైపడి దీనంగా ఆక్రోశించే సైనికులదారుణ రోదనధ్వను లతని కర్ణకుహరాలలో మారుమోగాయి. ఆ ఆక్రందన ధ్వనులతో జంబుకాక్రందనాలు మరింత విజృంభించాయి. అతనికి జీవితం అంతా కేవలం బీభత్సమయంగా కనిపించింది. అతడా భయంకరార్తనాదాలన్నీ వింటూ కూర్చున్నాడు. ఒకమారతని హృదయంలో, ప్రశాంతంగా కన్నుమూసిన లీలావతీముఖం ప్రతిబింబించింది. అమరుకుని నేత్రాంతాలలో కన్నీటి బిందువులు నిలిచాయి.

ప్రపంచంలో అంతటా గాఢాంధకారం! అతని హృదయంలోం అంతకన్నా గాఢాంధకారం! అమరుకుని హృదయంలో మళ్లీ ఆందోళన ప్రారంభమయింది! కాని ఆ భయంకరపరిస్థితిలో అతని కేమీ తోచలేదు!

ఆందోళన పూరితమై అలిసి సొలిసిన అతని హృదయంలో ఒక హెచ్చరిక గంభీరగా మారుమోగింది. అతడది శ్రద్ధగా ఆలకించాడు:

"తత్త్వమసి!
తత్త్వమసిరాజన్!"
"రాజా! నీవా పరమా
త్మ స్వరూపుడవు సుమా!
నీవాపరమాత్మ స్వరూపుడవుసుమా!"

ఆ హెచ్చరిక అర్థం అది! అతడు మళ్లీ మళ్లీ ఆహెచ్చరిక విన్నాడు! అంతటి అర్ధరాత్రి సమయంలో ఆహెచ్చరిక ఎక్కడి నించి బయలుదేరినదో అతనికంతు బట్టలేదు!

అతడు నాలుగు వైపులా గాలించి చూచాడు. దూరదూరంగా రాజవీధిలో అంతటా ఆ హెచ్చరిక మాటిమాటికీ అదే తీరులో ప్రతిధ్వనించింది! అనేక గాత్రాలేకమై ఒకే కంఠస్వరంతో ఉచ్చరించినట్లు మారుమోగింది!

భిక్షుకులెవరో ఆ విధంగా గొంతెత్తి అరుస్తున్నారని అతని కనుమానం వేసింది. కాని ఆ గంభీరనాదంలో అతని కెక్కడా యాచకదైన్యం గోచరించలేదు!

ఆ హెచ్చరిక వినగానే అతని హృదయంలో ఒక మహాసముద్రమేదో ఉప్పొంగినట్లయింది. హఠాత్తుగా తన్నెవరో వెన్ను చరిచి మేలుకొలిపిన విచిత్రానుభూతి కలిగింది. క్రమక్రమంగా అతని హృదయంలో ఒక పెద్ద ఆరాటం ప్రారంభమయింది. కాని ఆ ఆరాటానికి గల మూలకారణమేమో అతనికే తెలియలేదు!

ఆ హెచ్చరిక సవ్వడు లతనికేవో పూర్వజన్మలో పరిచితమయిన కంఠస్వరాలలాగే వినిపించాయి. కాని అతనికవి స్పష్టంగా గుర్తుకు రాలేదు! అమరుకుడలాగే ఆలోచిస్తూ కూర్చున్నాడు. తెల్లతెల్లవారే వేళ దగ్గరపడింది. కాని అంధకారచ్ఛాయలింకా బాగా విడిపోలేదు.

అంతలో నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ కింశుకప్రభ అతనిదగ్గిరికి వచ్చి నిలబడింది. ఆమె అందెల సవ్వడివిని అమరుకదేవుడామెవైపు చూచి నెమ్మదిగా ప్రశ్నించాడు.

"కింశుకప్రభా! ఆ హెచ్చరిక సవ్వడి విన్నావా? అదిగో విను!"

అతడు తిరిగి ఏకాగ్రహృదయంతో ఆ సవ్వడి విన్నాడు. కింశుకప్రభకు కూడా ఆ ధ్వని వినిపించింది:

"అవును! కాషాయధారు లయిన యతీశ్వరులెవరో ఆవిధంగా హెచ్చరిస్తూ వెళ్ళిపోతున్నారు! అరుగో!"

కింశుకప్రభ వేలెత్తి వారివైపు చూపించింది. అమరుకుడు లేచి నిలబడి ఆవైపుగా చూచాడు. మసకమసక చీకటిలో అతనికి వారిముఖాలేవీ స్పష్టంగాకనిపించలేదు. కంఠధ్వనులు మాత్రం తిరిగి గంభీరంగా మారుమోగాయి. వారొక గడియవరకు నిర్విరామంగా అలాగే గొంతెత్తి హెచ్చరించారు. అంతలోనే ఒకవీధి మలుపులో పడి అదృశ్యులయినారు. అమరుకదేవుడెంతో ఆత్రంగా కింశుకప్రభకేసి చూచాడు:

"వారినందరినీ ఒక్కసారి కళ్లారా చూడవలెనని ఉన్నది. వారికి నా విన్నపం తెలియజేసి తెల్లవారగానే ఒక్కమారిక్కడికి తోడుకొని రాగలవా?"

ఆ ప్రార్థన విని కింశుకప్రభ ఆశ్చర్యపోయింది.

"దీనికంత ప్రాధేయపడవలసిం దేమిఉంది. తమ సంకల్పం వినగానే వారంతట వారే ఇక్కడికి వస్తారు. తెల్లవారగానే వారినందరినీ తమ సన్నిధికి తీసుకు వస్తాను. సరికదా! ఇదిగో ఇప్పుడే వెళ్ళిపోతున్నాను."

ఆమె వెంటనే అక్కడినుంచి వెళ్ళిపోయింది. క్రమక్రమముగా బాగా తెల్లవారింది. రణరంగంలో మళీభయంకరభేరీ నినాదాలొక్కొక్కటిగా మారుమోగాయి. అది విని అమరుకుడొక ప్రతిజ్ఞ పట్టాడు:

"ఆ యతీశ్వరుల దర్శనం చేసి వెంటనే రణరంగానికి వెళ్లిపోతాను! ఈనాటితో ఈ మహాసంగ్రామం అటో యిటో తేలిపోతుంది! అంతే!"

క్రమక్రమంగాగురు భేరీ ధ్వనిభూనభోంతరాళాలు దద్దరిల్లే టంతటి భీభత్సంగా మారుమోగింది!

—సశేషం.



లాస్య విభ్రాంతి

గతసంచిక తరవాయి

౧౦

ప్రాతఃకాల సూర్యోదయ కాంతి మాళవ రాజధాని అంతటా బంగారు రంగవల్లులు తీర్చి దిద్దింది. దూర దూరంగా మారుమోగే రణభేరీధ్వని క్రమ క్రమంగా నగర సింహద్వారం సమీపించింది.

అమరుక దేవుడు యోధవేషం ధరించి, ఏ క్షణంలోనైనా యుద్ధరంగంలో దూకడానికి సిద్ధంగా నిలబడ్డాడు. కొలువుకూటంలో ప్రవేశించి, వేగులవారు చెప్పిన యుద్ధవార్తలొకటొకటే శ్రద్ధగా ఆలకించాడు. అతని శరీరంమీది రణవ్రణాలింకా కళుకు కళుకుమని వేధిస్తూనే ఉన్నాయి. కాని యుద్ధవ్యగ్రమైన అతని హృదయంలో ఆవేదనే స్ఫురించలేదు!

అనుక్షణము వేగులవారతని సన్నిధికివచ్చి మాళవసైన్యాల జయాపజయాలు నివేదిస్తూనే ఉన్నారు. ఒకమారు మాళవ సైనికులు శత్రు సైనికులను రాజధాని పొలిమేరవరకు తరిమివేశారు! ఇంకొకమారు విదర్భ సైనికుల ఒక్క దూకులో శత్రుసైన్యం అంతా మాళవ రాజధాని సింహద్వారంవరకు నెట్టివేశారు. ఇంకొక క్షణంలో శత్రుసైన్యం మాళవ రాజధానిలో ప్రవేశించవలసిందే! కాని అంతలోనే మాళవ సైనికులు తమ ప్రాణాలెదురొడ్డి శత్రుసైన్యాని కడ్డకట్టగా నిలుచున్నారు!

ఇక ఆలస్యం చెయ్యకుండా వెనువెంటనే యుద్ధరంగంలో దూకి తన సేనానాయకులకు, సైనికులకు ప్రోత్సాహం కలిగించాలని అమరుకదేవుడను క్షణము ఉవ్విళ్లూరుతూనే ఉన్నాడు. అయితే ఒక్కమారాయతీశ్వరుల సందర్శనానందము, వారి ఆశీర్వచన భాగ్యము పొంది ఉత్తర క్షణంలో కళ్లుమూసుకొని రణరంగంలో దూరకాలని అతని సంకల్పం.

యతీశ్వరుల సందరినీ వెంటబెట్టుకుని ఒక క్షణంలోనే తిరిగి వస్తానని చెప్పి వెళ్లిన కింశుకప్రభ ఇంకా అతని సన్నిధికి రాలేదు. అతడామె రాకకోసం ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తూ నిలుచున్నాడు. అంతలో రాజ్యవర్ధను డతి వినయంగా అతని సన్నిధికి వచ్చి నిలబడ్డాడు:

"మహాప్రభూ! శత్రు సైనికులు నగర ద్వారం సమీపించారు! ఘోరంగా పోరాడుతున్నారు. అయినా మన సైన్య మేమీ తీసిపోలేదు. చిట్టచివరికి జయలక్ష్మి మనదే! కనక తామిక స్వయంగా యుద్ధ రంగంలో దూరకవలసిన అవసరం నాకేమి కనిపించడం లేదు! అదీగాక తమరింకా కొంచెం విశ్రమించడం అవసరమని రాజవైద్యులు విన్నవిస్తూనే ఉన్నారు! ఆపైన తమ చిత్తం!"

ఊసూరుమని మహారాజొక నిట్టూర్పు విడిచిపెట్టాడు. అతని సంకల్పం ఆ క్షణానికి కొంతవరకు మారినదని మహామాత్యుడు గ్రహించుకొన్నాడు. మారు మాటాడకుండా నెమ్మదిగా అక్కడినించి వెళ్లిపోయాడు.

మహారాజు స్వయంగా యుద్ధ రంగంలో దూరకడం మహామాత్యునికి మొట్టమొదటి నించీ ఇష్టంలేదు. ఇప్పుడది మరింత బలపడింది. రాజ్యవర్ధను డేదో మిష పెట్టి మహారాజు స్వయంగా యుద్ధ రంగంలో దూరకకుండా అడుగడుగునా అడ్డు తగులుతూనే ఉన్నాడు!

మొట్టమొదట అమరుకదేవు డది ఆత్మక్షేమంకోసమే జరిగినదని అనుకోకపోలేదు. కాని క్రమక్రమంగా ఆ విషయంలో అతని కేదో సందేహం పట్టుకుని పీడించింది. రాజ్యవర్ధను డీటీవల మంత్ర తంత్ర శాస్త్రజ్ఞులతో జేరి మంతనాలారంభించాడు. అది చూచాయగా అమరుకదేవుని చెవిని పడింది.

అదికూడా తన క్షేమారోగ్యాల కోసమే అయి ఉండవచ్చునని అమరుకదేవు డొకప్పుడనుకున్నాడు. కాని ఆ విషయంలో ఇప్పుడతని కేదో పెద్ద అనుమానమే కలిగింది. అదే ఆలోచిస్తూ అతడొక క్షణం సేపలాగే నిలుచున్నాడు.

మళ్లీ యుద్ధభేరీ భైరవధ్వనిగంభీరంగా అతని కర్ణకుహరాలలో మారుమోగింది. అతడిక కింశుక ప్రభకోసం ఎదురుతెన్నులు చూస్తూ నిలబడలేకపోయాడు. వెంటనే రణరంగానికి బయలుదేరి వెళ్ళిపోవాలని అనుకొన్నాడు. అంతలో కింశుకప్రభ తొందర తొందరగా అతని సన్నిధికి వచ్చి విన్నవించింది:

"మహాప్రభూ! నావల్ల కొంచెం విలంబనమే జరిగింది. మన్నించండి! ఆయతీశ్వరులను వెదికి పట్టుకోవడం కొంచెం కష్టమే అయింది. చిట్టచివరి కెలాగో అలాగ వెదికి పట్టుకున్నాను. వారంతా ఇప్పుడే తమకొలువుకూటానికి విచ్చేయనున్నారు."

కింశుకప్రభ యతీశ్వరులంతా అక్కడికి రాగానే వారికి సవినయంగా నమస్కరించింది. ఎంతో మర్యాదచేసి ఆయా సుఖాసనాలపై కూర్చోవలసిందని ప్రార్థించింది. అమరుకదేవు డత్యంత భక్తిభావంతో వారందరికీ సాష్టాంగ నమస్కారాలు చేసి సవినయంగా చేతులు జోడించి నిలబడ్డాడు. కింశుకప్రభ అతని భక్తిప్రపత్తులు చూచి మొట్టమొదట కొంచెం ఆశ్చర్యపడుతూ నెమ్మదిగా అంతఃపురంలోనికి వెళ్ళిపోయింది.

యతీశ్వరు లెవ్వరు తమకేర్పరచినసుఖాసనాలపై కూర్చోలేదు. అలాగే నిలబడి నిశ్చల దృష్టితో అమరుకుని ముఖవైఖరి పరిశీలించారు:

"తత్త్వమసి!
తత్త్వమసి! రాజన్!"

అందరు ఒక్కే గొంతుతో నాలుగైదు మారు లెలుగెత్తి ఘోషించారు! ఆ ఘోష అమరుకదేవుని హృదయ కుహరంలో ప్రళయ సాగరఘోషే రేకెత్తించింది!

అమరుకదేవుడు వారందరి ముఖాలు అతి

జాగరూకతతో పరిశీలిస్తూ నిలబడ్డాడు. అతని హృదయంలో మళ్లీ ఒక పెద్ద మథన ప్రారంభించింది! అందరు అతన్ని ఉద్దేశించి "రాజా! నీవా పరమాత్మ స్వరూపుడవే! సుమా!" అని ఎలుగెత్తి హెచ్చరించారు!

"నేనెవరిని? నేనెవరిని? నేనమరుక దేవుడను కానా? కాకపోతే నా నిజస్వరూపమేమి! నేనా పరమాత్మస్వరూపుడనా? ఇది నిజమేనా? నేనమరుకడను కానే కానా? అయితే నేనెవరిని? నేనెవరిని?"

అతని హృదయంలోని మథన క్షణక్షణానికీ ఆ విధంగా హెచ్చు పెరిగింది! మరికొంత సేపటికమరుక దేవుని కేదో హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది. ఇంకా కొంత సేపటి కతని హృదయంలో పూర్వవృత్తాంతం అంతా ఒక మెరుపులా మెరిసింది!

ఆ క్షణంవరకు అతనిహృదయంలో ఉవ్వెత్తుగా పెరిగిన సందేహతరంగాలన్నీ పూర్తిగా అంతరించాయి. పెదవులపై, చిరునవ్వులు పువ్వులు పూశాయి.

"తత్త్వమసి!
తత్త్వమసి! రాజన్!"

మళ్ళీ వారందరి కంఠాలు ఒక్కుమ్మడిగా మారుమోగాయి. వెంటనే ఆయతీశ్వరులందరు అమరుకదేవుని పాదాలకు ప్రణమిల్లి జయ జయ ధ్వానాలు చేశారు. అమరుకదేవుని పెదవులపై చిరునవ్వులాగే ఆరని తారకలా మెరిసింది. క్రమ క్రమంగా ఆ పూర్వస్మృతి అంతా అతని మనోనేత్రాల కెదురుగా సాక్షాత్కరించింది!

౧౧

ఆచార్యశంకరుడు పద్మపాదాది శిష్యులతో కలిసి మాహిష్మతీనగరంలో మండనమిశ్రుని గృహప్రాంగణంలో అడుగు పెట్టాడు.

మండన మిశ్రుడు పూర్వ మీమాంసా శాస్త్రవేత్త. మహావిద్వాంసుడు. ప్రపంచలీల యావత్తు కర్మాధీనమే అని అతని మతం. పూర్వమీమాంసా శాస్త్రం సిద్ధాంతంకూడా అదే. యజ్ఞయాగాది కర్మలు, నిత్య నైమిత్తిక కర్మలు, పుణ్యకర్మలు ఆచరించేవారికి స్వర్గాది లోకాలు కరతలామలకాలనీ, ఆకర్మలే సర్వశ్రేయోదాయకాలనీ ఆ శాస్త్ర సిద్ధాంతం.

ఆచార్యశంకరుడు తన ఆసేతు హిమాచల

★ ఆచార్య విభ్రాంతి ★

యాత్రలో మీమాంసావేత్త మండన మిశ్రుని విఖ్యాతకీర్తి విన్నాడు. తన శిష్య బృందంతో కలిసి స్వయంగా ఆ మహావిద్వాంసుని గృహాంగణంలో నిలుచున్నాడు.

మండన మిశ్రుడంతకు పూర్వమే ఆచార్య శంకరుని అద్వైత వేదాంత వాదం కొంత వరకు కర్ణాకర్ణిగా విన్నాడు. స్వయంగా అంతటి ఆచార్య శంకరుడే తన కతిథి దేవుడై అవతరించాడని విని ఎంతైనా సంతోషించాడు. యతీశ్వర మర్యాదా గౌరవాదరాలతో ఆచార్యశంకరుని తోబాట శిష్యులందరినీ తన భవంతి కాహ్వానించాడు.

శంకరుని అద్వైత వేదాంత వాదానికీ, పూర్వమీమాంసా సిద్ధాంతానికీ కొన్ని ముఖ్యమైన వివాద విషయాలున్నాయనీ ఆ వివాదదృష్టితోనే ఆచార్యుడతిథిగా విచ్చేశాడనీ మండనమిశ్రుడు గ్రహించుకొన్నాడు. తన కింతకాలానికాచార్య శంకరుని వంటి మహాపురుషునితో వాదించే భాగ్యం కలిగిందని మండమిశ్రుడుప్పొంగిపోయాడు. తన పూర్వమీమాంసా సిద్ధాంతం ఇక ఆ నాటినుంచీ విద్వాంసులందరికీ శిరోధార్యం కాగలదని ఆనందించాడు.

ఆసమయంలో మండనమిశ్రుని ధర్మపత్ని ఉభయభారతి అతని దగ్గిరికి వచ్చి నెమ్మదిగా చెవిలో చెప్పింది:

"మీరేమో మీ శాస్త్రవాద బలంతో ఆచార్య శంకరుల నోడించాలని ఉవ్విళ్లూరుతున్నారు! కాని నాకా తేజోమూర్తిని సందర్శిస్తే అంతటి ధైర్యం కలగడంలేదు! ఒకవేళ మీరే ఆ వాదంలో పరాజితులై పోతే?"

మండనమిశ్రు డొక క్షణకాలం తన భార్యవైపు చూచాడు:

"ఒకవేళ నేనేకనక ఆ వివాదంలో పరాజయం పొందితే అద్వైత వేదాంత మార్గమే సర్వులకు శిరోధార్య మన్నమాట! వెంటనే సన్యసించి నేనాయన కంతేవాసినై వెళ్ళిపోతాను! అంతే! దీనికిక తిరుగులేదు!"

ఆ మాటవిని ఉభయభారతి బాగా భయపడింది. అయినా పైపైకొక చిరునవ్వు నవ్వింది:

"ఒకవేళ ఆచార్య శంకరులే పరాజితులై పోతేనో?"

"ఆయన తమ సన్యాసాశ్రమం విసర్జించి తిరిగీ పూర్వమీమాంసా కర్మమార్గం చేపట్టి తీరవలసిందే!"

"కానీయండి! ఇంతకీ ఏమి జరగవలసి ఉందో, అదే జరుగుతుంది! బుద్ధిః కర్మానుసారిణీ!"

ఉభయభారతి ఉసూరుమని ఒక వేడి నిట్టూర్పు విడిచిపెట్టింది. మండనమిశ్రుడు మహా విద్వాంసుడు. అంతేకాక మహా సాహసి. ఇది శాస్త్రసమ్మతమైన మార్గం అని నమ్మక కలిగితే వెంటనే ఆమార్గం అనుసరించడానికి కాయన వెనకంజ వెయ్యడు! మాటలకు, చేతలకు మధ్య లేశమైనా విభేదం అంగీకరించని కర్మనిష్ఠుడు!

ఉభయభారతి ఆయన సన్నిధిని సర్వ శాస్త్రాలు, షడ్దర్శనాలు అధ్యయనం చేసింది. మహా విద్వాంసురాలని అందరిచేత మన్ననలందుకొన్నది. అంతటి విద్వాంసురాలే భర్తకిప్పుడొక మహావేత్తమూలాన పరాజయం రానున్నదని భయపడింది. కాని మండన మిశ్రుడటువంటి పరాజయభయమేమీ లేదనీ, ఆచార్య శంకరుడే పరాజయం పొందగలడనీ అభయహస్త మిచ్చాడు.

శంకరాచార్య మండన మిశ్రుల మధ్య శాస్త్రచర్చ జరుగనున్నదని విని మాహిష్మతీ నగర విద్వాంసులంతా మండనమిశ్రుని భవంతిలో గుమిగూడారు. మధ్యాహ్నం రెండు యామాలవేళ దాటి కొంచెం చల్లబడగానే శాస్త్ర చర్చ ప్రారంభమయింది. ఆచార్య శంకరుని ప్రియాంతేవాపద్మపాదాచార్యుడు, ఉభయభారతి, మరికొందరు శాస్త్రవేత్తలు వారిద్దరి వాదోపవాదాలు శ్రద్ధగా ఆలకిస్తూ మధ్యస్థ ధర్మం నిర్వహించారు. మొట్టమొదట ఛలోక్తులతోను, చమత్కారాలతోను ప్రారంభమైన శాస్త్రచర్చ క్రమక్రమంగా గహనాతి గహనమైన శాస్త్రవిషయాలలోకి వెళ్ళిపోయింది. ఆచార్య శంకరు డత్యంత ప్రసన్న వదనంతో శాస్త్రచర్చ సాగించాడు. ఆయన ముఖంలో లవలేశమైనా విజిగీషా భావం గోచరించలేదు! మండనమిశ్రుడా మహాపురుషుని సౌజన్యము, సౌహార్దము, సత్యనిష్ఠ చూచి నిర్ఘాంతపోయాడు! అతడింతకుపూర్వం ఎన్నెన్నో వాదోపవాదాలు సాగించాడు. ఎందరెందరో విద్వాంసులతో వాదించాడు. ఆ విద్వాంసులలో ఎంతసేపు ఎదటివారిని ఓడించాలన్న తహతహేగాని, సరియైన సత్యనిష్ఠ కనబడలేదు! ఆచార్య శంకరుని ధోరణి దానికి కేవలం విభిన్నంగా కనిపించింది!

ఇంచుమించుగా సాయంకాలం గోధూళి వేళ వరకు శాస్త్రచర్చ కొనసాగింది. అంతవరకు మండనమిశ్రుడు తన శాస్త్ర పాండిత్యంతో స్వయంగా ఆచార్య శంకరుని మన్ననలే అందుకొన్నాడు! కాని క్రమక్రమంగా మండవమిశ్ర పండితుని వాదబలం క్షీణించింది. చిట్టచివర కుభయ భారతితో సహా అందరు ఆచార్య శంకరుని వాదమే వేదశాస్త్ర సమ్మతమని అంగీకరించారు. కాని మండనమిశ్రు డెక్కడా చలించలేదు! వెనువెంటనే సన్యాసాశ్రమం స్వీకరిస్తున్నానని సదస్యులందరికీ తన అచంచల సంకల్పం తెలియజేశాడు!

అంతలో ఉభయభారతి లేచినిలబడి ఆచార్యశంకరునికీ, మధ్యస్థులకు సవినయంగా నమస్కరించి విన్నవించింది:

"నాదొక్క మనవి! ధర్మపత్ని పురుషుని కర్థాంగి అని మన శాస్త్రవేత్త లుద్ఘోషిస్తున్నారు. అందుచేతనన్ను కూడా శాస్త్రవాదంలో జయించే వరకు ఈవిజయం సంపూర్ణ విజయం కాజాలదని మనవి! ఆపైన తమ చిత్తం!"

ఆమె వాదం విని ఆచార్య శంకరుడే ఔనౌనన్నట్టలవోకగా శిరఃకంపం చేశాడు. ఆయనే ఔనని అంగీకరించినప్పుడిక మధ్య విద్వాంసుల కడ్డుచెప్పడానికి మనసొప్పలేదు. అదీగాక వారికికూడా ఆమె ఆశంక న్యాయ్యమేనని తోచింది. మండన మిశ్రుడు మరి సమాధానం చెప్పలేక తలవంచుకొని కూర్చున్నాడు.

కుటుంబ నియంత్రణం
గర్భనిరోధానికి
స్త్రీలు సేవింపదగిన ఔషధము స్పెక్ టేబ్‌లెట్స్ (రిజష్టర్డ్) గర్భమురాకుండేందుకు తేలికగానోటిలో వేసుకొని మింగే మందు 12 రోజులు మందు వాడిన యడల గర్భధారణ కాకుండా చేయును..
పూర్తికోర్సు ప్యాకెట్టు 24 మాత్రలు వెల రు 12/- వి పి అదనము ప్రతిచోట దొరుకును
ఇండియాలోను, విదేశాలలోను ఈమందువాడినవారు అయాచితంగా అనేక యోగ్యతాపత్రము లను పంపియున్నారు...

SEENU & CO.,
28 K TANDAVARAYA GRAMANI ST - MADRAS-21
GRAMS ORCAS, (ESTD 1946), PHONE 55357.
(ADVT. PERMITTED UNDER G O MS. NO. 1121, HEALTH)

మళ్ళీ ఉభయ భారతీ శంకరాచార్యుల మధ్య శాస్త్ర వివాదం చెలరేగింది.

ఆమె మండనమిశ్రుడు తొక్కి చూడని నూతన మార్గాలలో మీమాంసా శాస్త్ర చర్చ ప్రారంభించింది. క్రమక్రమంగా ఆచర్చ అనేక శాస్త్ర సంప్రదాయ మార్గాలలో కొనసాగింది. మరి కొంతసేపటి కది గృహస్థ ధర్మం మీదికి తిరిగింది.

ఉభయ భారతికి కంతవరకు ఆచార్య శంకరుని పరాజయం సాధ్యం కాలేదు! ఆచార్య శంకరుడు భారత వర్షంలో అంతటా దిగ్విజయయాత్ర చేసి అద్వైత మత ప్రతిష్ఠాపనాచార్యుడని ప్రసిద్ధివహించాడు. మండన మిశ్రుని వంటి మహావిద్వాంసునికే ఆచార్య శంకరుని పరాజయం సాధ్యం కాకపోతే, ఇక ఉభయభారతి మాత్రమేమి చెయ్యగలగు?

కొంతసేపటికామెకొక ఉపాయం తట్టింది. ఆలోచించి ఆలోచించి తన వాదోపవాదధూళిలో కామశాస్త్ర ప్రస్తావన చొప్పించి దానిపై ఒకవివాదం లేవదీసింది. ఆవివాదానికి సమాధానమిస్తే ఆచార్యశంకరుడాజన్మ బ్రహ్మచారి అన్న ప్రతిష్ఠకే భంగం కలుగుతుంది!

సమాధానమేఇవ్వకపోతే మధ్యస్థ విద్వాంసులాచార్యుడా వాదంలో ఓడిపోయినట్లే నిర్ణయిస్తారు! ఆవిషమసంధిలో ఆచార్య శంకరుడు కేవలం మౌనంవహించి మాట్లాడకూరుకున్నాడు. మధ్యస్థ విద్వాంసులకేమీ పాలుపోలేదు. వారిలోవారు కొంతసేపు గుసగుసలాడుకొన్నారు.

అది కేవలం గృహస్థధర్మానికి సంబంధించిన ప్రశ్న. ఆచార్యుడాజన్మబ్రహ్మచారి. అందుచేతనే ఆచార్యుని పరాజయం నిర్ణయించడానికి మధ్యవర్తులంగీకరించలేదు. అయితే ఆరుమాసాల వ్యవధిలోనైనా ఆచార్యుడుభయభారతి ప్రశ్నకు సమాధానం చెప్పాలని అందరు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆచార్యుడు పర శరీరప్రవేశ విద్యావేత్త. ఆవిధంగా కొంత అనుభూతిపొంది, ఉభయభారతి ప్రశ్నకుచితమయిన సమాధానమిస్తే తన బ్రహ్మచర్య నిష్ఠకేలోపము రాదు. ఆక్షణంలో ఆచార్యశంకరుని కదే సముచితమయిన మార్గమని స్ఫురించింది.

అంతటితో ఆ వాదోపవాదాలలాగే నిలిచిపోయాయి. తాత్కాలికంగానైనా మండనమిశ్రునికి సన్యాసయోగం తప్పించినందుకుభయభారతి ఎందరు అభినందించారు. ఆచార్యుడు పద్మపాదాది శిష్యులతో కలిసి తిరిగే దిగ్విజయయాత్రకుపక్రమించాడు. ఆరుమాసాల అవధికి పూర్వమే మళ్లీ మాహిష్మతీనగరం చేరుకొగలనని మండన మిశ్రునికి వాగ్దానం చేశాడు.

"ఆచార్యపాదులు సర్వజ్ఞులు! అంతటి మహామేధావికీ తుచ్ఛమయిన కామశాస్త్ర రహస్యం ఒక లెక్కా! అయితే కేవలం లోకధర్మ సంగ్రహం కోసమే ఆచార్యులీ మార్గం అవలంబించి ఉండవచ్చును!"

పద్మపాదాది శిష్యులందరు ఆచార్యుని సంకల్పానికావిధంగా భాష్యాలు రచించుకొన్నారు. మారుమాటాడక ఆచార్యుని అడుగుజాడలలోపడి నడిచి వెళ్ళిపోయారు.

పది పదిహేను రోజులలో వారందరు మాళవరాజ్య సమీపారణ్యం చేరుకొన్నారు.

ఆచార్యునికా ప్రాంతంలో సింహం పంజాదెబ్బతో నిర్జీవమైపోయిన అమరుక భూపతి శరీరం కనిపించింది. పర శరీర విద్యా ప్రభావం వినియోగించి, వెంటనే శంకరుడా శరీరంలో ప్రవేశించాడు. తన శరీరం ఒక గుహలోఉంచి జాగ్రత్తగా సంరక్షించ వలసినదని శిష్యులందరికీ ఆజ్ఞాపించాడు. ఆ శరీరానికేదైనా మహా ప్రమాదం ఏర్పడితే వెంటనే తనకా విషయం తెలియజెయ్యవలసిందని పద్మపాదునికతి రహస్యంగా ఆదేశించాడు. అటుపిమ్మట అమరుకదేవుని శరీరాను భూతిలో లీనమై మూర్ఛలో మునిగిపోయాడు. క్రమక్రమంగా మహాభోగి అయిన అమరుకదేవుని అంతఃపురంలో ప్రవేశించి కామకళా రహస్యాలన్నీ అవలీలగా అవగాహనం చేసుకొన్నాడు.

౧౨

అమరుకదేవుని శరీరంలో నిలిచిన ఆచార్య శంకరుని హృదయంలో, పూర్వస్మృతులన్నీ ఆవిధంగా క్రమక్రమంగా ఒకటొకటిగా పురివిప్పి నృత్యం చేశాయి.

"కొంతకాలంపాటి శరీరంలో నివసించినంతమాత్రాన నాకే ఇంతటి విస్మృతి విభ్రాంతులు కలిగాయే! ఇక సాధారణ సంసారులకు శరీరాత్మ భ్రాంతి కలగడంలో ఆశ్చర్యమేమి ఉంది!"

శంకరాచార్యుడు కొంతసేపలాగేఆశ్చర్య ముద్రలో మునిగిపోయాడు.

క్రమంగా ఆచార్య శంకరునికి, అమరుకదేవుని అంతఃపురాంగనలు, వారితో కలిసి మెలిసి తానుభవించిన మహాభోగాలు, కింశుక ప్రభగాఢానురాగము, ఆమె నృత్య హేలావిలాసాలు — మొదలైనవన్నీ స్ఫురణకువచ్చాయి. అంతలోనే "ఆ భోగాలనుభవించిన వ్యక్తివేరు! నేను వేరు! నేను కేవలం అజరామరమైన పరమాత్మ మూర్తిని! నేనా వ్యక్తిని కాదు!" అన్న స్ఫురణ కలిగింది. ఇంకొక క్షణంలో "అందరు పరమాత్మ స్వరూపులే! కేవలం నా స్వరూపులే! పరమార్థ దృష్టిలో పరిశీలిస్తే నాకు, ఆ అంతఃపురాంగనలకు భేదమేమీ లేదు! లేదు!" అని స్ఫురించింది. ఆచార్య దేవుని హృదయంలో వారందరిపైన అపారమైన కరుణావాహిని వెల్లివిరిసింది. అంతేకాదు: ఆ క్షణంలో చరాచర ప్రపంచం అంతటిమీద ఆచార్యుని

చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు:

దీ సౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

★ ఆచార్య విశ్రాంతి ★

ఈ వారంతో

ప్రాచీనగాథాలహరి అయిపోయింది.

అపారకరుణావాహిని జాలువారింది. తన చల్లని అద్వైతామృత వృష్టితో ప్రపంచంలో ప్రాణులందరికీ ఇంత విజ్ఞాన భిక్ష పెట్టి వారందరి హృదయవేదనా జ్వాలలు ఒక్కమారుగా చల్లార్చివేయాలని ఒక మహా సంకల్పం కలిగింది. ఆ భావనతో ఆచార్య శంకరుని చెక్కిళ్ళపై కన్నీటి బిందువులే జాలువారాయి.

అంతలో రాజ్యవర్ధను డక్కడికివచ్చాడు:

“మహాప్రభూ! యుద్ధంలో మనకే దిగ్విజయ సూచనలు గోచరిస్తున్నాయి. శత్రువులందరు చెల్లాచెదరై పారిపోతున్నారు! తమకిక ఈ యోధవేషం అనవసరం!”

రాజ్యవర్ధను డలాగే నిలుచున్నాడు.

“మీ వంటి మహామాత్యులుండగా నాకేమి కొదవ. స్వయంగా మీరే ఇక ఈ రాజ్యసంరక్షణా భారం వహించండి. నాకింకా పూర్తిగా స్వస్థత కలగలేదు. మన సైన్య సన్నాహభారం కూడా ఇక మీరే వహించండి!”

దానితో తన సంకల్పం పూర్తిగా నెరవేరినదని రాజ్యవర్ధను డనుకొన్నాడు. ద్విగుణీకృత ధైర్యంతో తిరిగి యుద్ధ వ్యూహ సన్నాహాలారంభించాడు.

ఆచార్యు డొకమారు మాళవ రాజధానీ నగరంవైపు, అంతఃపురంవైపు చూచాడు. ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. తిరిగి తన పూర్వ దేహంలో ప్రవేశించవలెనని సంకల్పించాడు.

ఆచార్య శంకరుని దగ్గర సెలవు తీసుకొన్న యతీశ్వరు లంతకు పూర్వమే మాళవారణ్యానికి ప్రయాణమైనారు.

వారరణ్యంలో ప్రవేశించే సరికి, పర్వత గుహలో ఆచార్య శంకరుని శరీరం భద్రంగా సంరక్షిస్తున్న యతీశ్వరు డొకడు తొందర తొందరగా వారి సన్నిధికి వచ్చాడు:

“మాళవ రాజాధికారులు కొందరు గురుపాదుల శరీరానికి బలాత్కారంగా దహన సంస్కారం చేస్తున్నారు! రండి! రండి! గురుదేవుని శరీరం చితిపాలు కాకుండా సంరక్షించండి!”

అది వినగానే పద్మపాదాది శిష్యులంతా పర్వతగుహదగ్గిరకి పరుగులుపెట్టారు. ఆపైన మరిఆచార్యశరీరానికిదహనసంస్కారంజరగకుండా, సరిగా సమయంలో అడ్డుపడ్డారు. పద్మపాదుడు మాళవరాజాధికారులెవరు ఆ గుహ సమీపానికికూడా రావడానికి వీలులేదని గట్టిగా కట్టడిచేశాడు. మాళవాధికారులిక గత్యంతరంలేక తలలు వంచుకుని తిరిగి వెళ్ళిపోయారు.

పద్మపాదునికిమాళవరాజాధికారులచర్యలకంతరార్థం అంతా విస్పష్టంగాబోధపడింది. రాజ్యవర్ధనుడు కొంతమంది మంత్ర తంత్ర శాస్త్రజ్ఞులతో సంప్రదించి అమరుకదేవుని శరీరంలో పరశరీరప్రవేశ విద్యావేత్త ఎవరో ప్రవేశించి ఉండవచ్చునని గ్రహించాడు. రాజ్యసంరక్షణ కేవిధంగానైనా అమరుక దేవుని జీవితం అత్యవసరమని అతనికి స్ఫురించింది. వెంటనే మాళవరాజ్య పరిసరాలలో ఉన్న మృతశరీరాలన్నిటికీ దహనసంస్కారం చేసితీరాలని ఆజ్ఞాపించాడు. గుప్తంగా సంరక్షించినమృతశరీరాలుకూడాకనిపెట్టిబలాత్కారంగానైనాఅవిదహించివెయ్యవలసిందే అని గట్టిగా కట్టడిచేశాడు. అందువల్లనే యతీశ్వరు లక్కడలేని అదను కనిపెట్టి రాజాధికారు లాచార్యునిశరీరం బలాత్కారంగా దహించి వెయ్యాలని సంకల్పించారు. కాని తరుణంలో అది చూచిన పద్మపాదాది శిష్యులు రాజాధికారుల ఆటలు సాగనీయలేదు. వారంతకుపూర్వమేఅమరుకశరీరంలో ప్రవేశించిన ఆచార్యుని కాత్మవిస్మృతికలిగి ఉండవచ్చునని భయపడ్డారు. రాజధానీ నగరంలో ప్రవేశించి వారందరు ఉచ్చైస్స్వరాలతో హెచ్చరిక లుచ్చరించడానికి అసలు కారణం అదే! కాని వారెంత జాగరూకత వహించినా చిట్టచివరి కాచార్యుని శిరోభాగం కొంతవరకు అగ్నిజ్వాల కాహుతి కాక తప్పలేదు! పద్మపాదాది శిష్యులా అగ్నిజ్వాలలు చల్లార్చి ఆచార్యుని శిరోభాగానికి గాయశస్త్ర చికిత్సలు చేశారు. ఆచార్యుని పార్శ్వంలో నిలిచి అత్యంతభక్తి భావంతో అగ్నిసూక్తపారాయణ ప్రారంభించారు. కొంతసేపటికాచార్యుని శరీరంలో తిరిగి దివ్య చైతన్యం జ్వాల వికసించింది.

మరికొంత సేపటికాచార్య ముఖంలో చిరునవ్వుదయించింది! శిష్యులది చూచి అత్యంతభక్తి భావంతో ఆచార్యునికి జయజయధ్వానాలు చేశారు.

ఆచార్యశంకరుడు నెమ్మదిగా కళ్లుతెరిచి నాలుగు వైపులా పరిశీలించి చూచాడు. పద్మపాదాది యతీశ్వరులందరు తిరిగీ జయజయధ్వానాలు చేశారు.

కాని ఆచార్యుని శిరోవేదన వేయిశూలాలై వేధించింది. ఆ వేదనానుభూతి పొందిన ఆ అద్వైతాచార్యుని హృదయంలో నిఖిల ప్రపంచ ప్రాణికోటి వేదన మరింత తీవ్రంగా వేధించింది. ఆ ప్రాణులందరిమీద ఆచార్యుని అపార కారుణ్యదృష్టి ప్రసరించింది. మండన మిశ్రునికేకాక ప్రపంచ ప్రాణులందరికీ తన అద్వైతామృతం చవిచూపించాలనీ, వారి నందరినీ సంసార జటిల దుఃఖాల సుడిగుండాలలోంచి తరింపజేయాలనీ ఆమహాపురుషునికొక దివ్య సంకల్పం కలిగింది.

ఆచార్యుడిక తన శిరోవేదన లక్ష్యపెట్టనే లేదు! వెనువెంటనేలేచి మాహిష్మతీ నగరానికి బయలు దేరాలని సంకల్పించాడు. పద్మపాదుడది గ్రహించి ఆచార్యునికి తన చేయి అందిచ్చాడు. అతని భుజంమీద చేయివేసి ఆచార్యుడు నెమ్మదిగా లేచి నిలుచున్నాడు. వారందరు వెంటనే మాహిష్మతికి ప్రయాణమయ్యారు. ప్రపంచప్రాణి సముద్ధరణ దృష్టితో తన శరీర స్వస్థత లవలేశమైనా గమనించకుండా బయలుదేరిన ఆచార్యునివైపు చూడగానే పద్మపాదాది శిష్యుల నేత్రాలలో బాష్పమాలికలు తోరణాలై నిలిచాయి!

వారందరు ముక్తకంఠాలతో మళ్ళీ జయజయధ్వానాలు చేశారు. ఆ ధ్వనులా గుహాముఖంలో మరింత గంభీరంగా మారుమోగాయి!

— సమాప్తం. ★

కలవరపడు స్త్రీలకు

“కుమారి” మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించుము. చింత అనవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజి ప్యాకింగు ప్రత్యేకం
Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.
స్టాకిస్టు: Indo Medical supplies
No. 3 Paul appan st, Seven wells
Madras - 1.